

టీ పెట్టి.. పెన్షన్ అందజేసి..



లబ్ధిదారుని ఇంట్లో టీ పెడుతున్న హోం మంత్రి అనిత

- ఉద్దండపురంలో పింఛన్ల పంపిణీ ప్రారంభించిన హోం మంత్రి అనిత

నక్కపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దండపురం గ్రామంలో శనివారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీని హోం మంత్రి అనిత ప్రారంభించారు. లబ్ధిదారులకు పింఛన్లు అందజేసి వృద్ధులు, దివ్యాంగులతో ముచ్చటించారు. ఇటీవల ఆపరేషన్ చేయించుకున్న టీడీపీ కార్యకర్త ఆవాల నాగేశ్వరరావును పరామర్శించారు. అనంతరం ఆయన ఇంటి వద్ద అనిత టీ పెట్టి, ఆయన కుటుంబసభ్యులకు అందజేశారు. ఆమె వెంట నియోజకవర్గం కూటమి నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, కొండబాబు, గెడ్డం బుజ్జి, లాలం కాశీనాయుడు,కురందాసు నూకరాజు, పెదిరెడ్డి చిట్టిబాబు, అమలకంటి అబద్ధం, పెట్ల లింగం నాయుడు, చించలపు పద్దు, వైబోయిన రమణ, గొర్ల రాజబాబు, అల్లు నర్సింహమూర్తి, పొడగట్ల రమణ, పేకేటి రాజారావు, మజ్జూరి నారాయణరావు, అమలకంటి హరికృష్ణ, తదితరులు వున్నారు.



వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న అనిత

హెల్మెట్ వాడరు.. చలానా కట్టరు

అనకాపల్లి రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): **జిల్లా పరిధిలో ట్రాఫిక్ ఉల్లంఘనలు పెరుగుతున్నాయి. పోలీసులు చలానాలు విధిస్తున్నా ట్రాఫిక్ ఉల్లంఘనదారులు ఖాతరు చేయడం లేదు. నిబంధనలను ఉల్లంఘించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నా మార్పు రావడం లేదు. ఈ నేపథ్యంలో ఎక్కువ సార్లు నిబంధనలు ఉల్లఘించిన వారిపై పోలీసులు దృష్టి పెట్టారు.**



హెల్మెట్ లేకుండా వాహనం నడిపిన యువకుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు (ఫైల్)

పెరుగుతున్న ట్రాఫిక్ ఉల్లంఘనలు

- పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నా మార్పు రాని వైనం
- ఎక్కువ సార్లు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ప్రత్యేక దృష్టి

జిల్లా పరిధిలో చాలా మంది ద్విచక్ర వాహనదారులు మోటార్ వాహన చట్టం నిబంధనలను పదే పదే ఉల్లంఘిస్తున్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, బైక్‌పై ముగ్గురు చొప్పున వెళుతుండడం సాధారణమైపోయింది. వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ మాట్లాడేవారు కొందరైతే, మితిమీరిన వేగంతో రాంగ్ రూట్‌లో ప్రయాణించేవారు ఇంకొందరు ఉంటున్నారు. అలాగే కారుల్లో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవడం లేదు. అటువంటి వారందరికీ ట్రాఫిక్ పోలీసులు చలానాలు రాస్తున్నారు.



ఉల్లంఘనదారుల వాహన వివరాలను ట్యాబ్‌లో నమోదు చేస్తున్న దృశ్యం (ఫైల్)

సంవత్సరం	ఈ- చలానాలు	మొత్తం (రూ.)లో	చెల్లించిన చలానాలు	చెల్లించిన మొత్తం
2024 (జనవరి- డిసెంబరు)	95,203	2,46,80,847	29,937	71,95,981
2025 (జనవరి నుంచి మే 28 వరకు)	27,009	89,77,652	8,903	23,69,676

ఈ- చలానాల వసూళ్లపై దృష్టి

ఈ- చలానాల వసూళ్లపై పోలీసులు దృష్టి పెట్టారు. జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారికి గతంలో విధించిన ఈ-చలానాలకు సంబంధించిన జాబితాను తయారు చేశారు. దీంతో ఎక్కువ మంది అనేక సార్లు నిబంధనలను ఉల్లంఘించిన విషయం బయటపడింది. ఇప్పటి వరకు కేవలం ఉల్లంఘనదారులపై చలానాల జారీపై మాత్రమే దృష్టి పెట్టారు. దీని వల్ల చెల్లించే వారు చెల్లిస్తున్నారు, మిగిలిన వారు తమకు పట్టనట్టు వదిలేస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రవాణాశాఖ సర్వర్‌లోని వివరాల ఆధారంగా వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. పోలీసులు ద్విచక్ర వాహనాలు, కార్లు, భారీ వాహనాలను ఆపి వివరాలు పరిశీలిస్తున్నారు. ఆ వాహనాలపై చలానాలు ఉంటే వాహనదారునికి వివరిస్తున్నారు. చెల్లించాలని చెబుతున్నారు. చాలా మంది డిజిటల్ పద్ధతిలో అప్పటికప్పుడు చెల్లిస్తున్నారు.

బదిలీల హడావిడి



రెండో తేదీలోగా పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశాలు

- సిటీ, పరిసర ప్రాంతాలు, అనకాపల్లి చుట్టుపక్కల మండలాల్లో పోస్టింగ్ కోసం పలువురు తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్ల యత్నం
- సిఫారసు లేఖల కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు
- స్వయంగా ఫోన్లు చేయిస్తున్న మరికొందరు...
- ఇంచుమించు అన్ని శాఖల్లోనూ అదే పరిస్థితి
- ఐదేళ్లు ఒకేచోట పనిచేసిన వారికి స్థాన చలనం తప్పనిసరి
- హౌసింగ్‌లో బదిలీలకు జాబితా సిద్ధం

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో బదిలీల హడావిడి మొదలైంది. జూన్ రెండో తేదీ నాటికి అంటే సోమవారం సాయంత్రంలోగా బదిలీల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. దీంతో అన్ని శాఖల్లో బదిలీ అయ్యే ఉద్యోగులతో కూడిన జాబితాలు సిద్ధమయ్యాయి. కొన్ని శాఖల్లో సోమవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కోరుకున్న చోట పోస్టింగ్ కోసం అధికారులు, ఉద్యోగులు కొందరు కూటమి పార్టీ ప్రజా ప్రతినిధులు, నేతల నుంచి సిఫారసు లేఖలు తీసుకుని సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు అందజేస్తున్నారు. మరికొందరు స్వయంగా ఫోన్లు చేయించుకుంటున్నారు. బదిలీల మార్గదర్శకాల మేరకు ఒకేచోట ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగులను విధిగా వేరొక చోటకు పంపాలి. స్పౌజ్, సంఘ నేతలను కొన్ని షరతుల మేరకు బదిలీల నుంచి మినహాయిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు బదిలీల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కీలకమైన రెవెన్యూలో బదిలీల కోసం జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. రెండు రోజుల క్రితం మూడు జిల్లాల కలెక్టర్లు విశాఖలో సమావేశమై బదిలీలపై చర్చించారు. ఈలోగా పలువురు తహశీల్దార్లు, ఉద్యోగులు తమకు తెలిసిన ప్రజా ప్రతినిధుల నుంచి సిఫారసు లేఖలు సంపాదించి జిల్లా యంత్రాంగానికి అందజేశారు. ప్రధానంగా తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ కేడర్ అధికారులు బాగా ఆదాయం వచ్చే మండలాలు/నగరం, అనకాపల్లికి దగ్గర మండలాల్లో పోస్టింగ్స్ కోసం యత్నిస్తున్నారు. ఐదేళ్లకు మించి ఒకేచోట పని చేసిన వారు కూడా తమను కదిలించవద్దంటూ లేఖలు అందజేస్తున్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఐదుగురు తహశీల్దార్లు మూడు నుంచి ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేశారు. నిబంధనల మేరకు వారికి మైదానంలో అనకాపల్లి/విశాఖ జిల్లాల్లో పోస్టింగ్ ఇవ్వాలి. దీంతో నగరం నుంచి పలువురు తహశీల్దార్లకు స్థానచలనం తప్పనిసరిగా చెబుతున్నారు. ఆరోపణలు ఎక్కువగా ఉన్నవారితోపాటు పనితీరు పేలవంగా ఉన్న తహశీల్దార్లను పొరుగు జిల్లాలకు పంపాలని విశాఖ జిల్లా అధికారులు భావిస్తున్నట్టు రెవెన్యూ వర్గాల్లో వినిపిస్తోంది. తమకు తలనొప్పులు తెచ్చే అధికారులను సాగనంపుతారని జోరుగా ప్రచారం సాగుతుంది. నగరానికి దక్షిణ ప్రాంతంలో పనిచేస్తున్న తహసీల్దారు ఒకరు భీమిలి నియోజకవర్గంలో ఒక మండలానికి వెళ్లేందుకు సిఫారసు లేఖ సంపాదించారని చెబుతున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న మండలంలో ఆయన వసూళ్లు మొదలుపెట్టారని, ఇప్పటికే ఏసీబీకి ఫిర్యాదులు అందాయని అంటున్నారు.

ఇదిలావుండగా జల వనరుల శాఖలో గ్రామీణ ప్రాంతంలో ఉన్న కొందరు ఉద్యోగులు నగరానికి రావడానికి ప్రజా ప్రతినిధుల నుంచి సిఫారసు లేఖలు తీసుకున్నారు. కొందరు ... మిగతా 8వ పేజీలో

మద్యం దుకాణాలపై నిఘా

ఒక్కో షాపు వద్ద నాలుగు సీసీ కెమెరాల ఏర్పాటు



మద్యం దుకాణానికి సీసీ కెమెరా అమర్చిన దృశ్యం(వృత్తంలో)

- జిల్లాలో 8 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 161 షాపులు
- అమరావతి, అనకాపల్లిలో కంట్రోల్ రూమ్‌లు
- కంట్రోల్ రూమ్ నుంచి పబ్లిక్ ఐపీ ద్వారా పర్యవేక్షణ

నర్సీపట్నం, మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మద్యం దుకాణాల వద్ద పర్యవేక్షణ కట్టుదిట్టం చేస్తున్నారు. అన్ని షాపులకు సీసీ కెమెరాలు అమర్చుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వైన్ షాపులలో మద్యం లూజ్ విక్రయాలు చేయకూడదు. ఒక వ్యక్తికి మూడు మద్యం బాటిళ్లకు మించి ఇవ్వకూడదు. మద్యం బాటిల్ మీద ఉన్న నిర్ణీత ధర కంటే అధిక ధరకు విక్రయించకూడదు. ఎక్సైజ్ శాఖలో సిబ్బంది కొరత అధికంగా ఉన్న కారణంగా మద్యం షాపుల పర్యవేక్షణ ఎక్సైజ్ అధికారులకు కష్టతరంగా మారింది. ఈ సమస్యను అధిగమించేందుకు సాంకేతికతను వినియోగిస్తున్నారు. జిల్లాలో నర్సీపట్నం, గొలుగొండ, వి.మాడుగుల, చోడవరం, పాయకరావుపేట, ఎలమంచిలి, సబ్బవరం, అనకాపల్లి ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 161 ప్రైవేటు వైన్ షాపులు ఉన్నాయి. ఒక్కొక్క దుకాణానికి నాలుగు చొప్పున సీసీ కెమెరాలు అమర్చాలి. ఇప్పటికే 151 షాపులకు సీసీ కెమెరాలు అమర్చారు. మిగిలిన పది షాపులలో కూడా అమరుస్తున్నారు. అన్ని షాపుల వద్ద బ్రాడ్ బాండ్ ఇంటర్నెట్ కనెక్షన్ తప్పనిసరి చేశారు. పబ్లిక్ ఐపీ (ఇంటర్నెట్ ప్రొటోకాల్)ద్వారా వైన్ షాపుల పర్యవేక్షణ చేస్తారు. రాష్ట్ర స్థాయిలో అమరావతి కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తారు. జిల్లా స్థాయిలో అనకాపల్లిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. పబ్లిక్ ఐపీ లింక్‌తో ఎక్సైజ్ సీఐలు కూడా పర్యవేక్షణ చేయవచ్చు. ఎక్సైజ్ స్టేషన్లకు టీవీ మోనిటర్లు పంపిణీ చేశారు. భవిష్యత్తులో మద్యం షాపులో విక్రమించే ప్రతీ బాటిల్‌ని స్కాన్ చేసే అవకాశం ఉంది. డిపో లోంచి మద్యం స్టాక్ ఎంత ... మిగతా 8వ పేజీలో

జిల్లాలో 92.15 శాతం పింఛన్ల పంపిణీ

అనకాపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ శనివారం సాయంత్రానికి 92.15 శాతం పూర్తయింది. జిల్లాలో 2,54,962 మంది లబ్ధిదారులు ఉండగా, 2,34,937 మందికి (92.15 శాతం) పంపిణీ చేసినట్టు డీఆర్‌డీఏ పీడీ శచీదేవి తెలిపారు. ఇంకా 20,025 మందికి పంపిణీ చేయాల్సి ఉందన్నారు. జూన్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ప్రభుత్వం ఒక రోజు ముందే పింఛన్లు పంపిణీ చేసింది. ఇళ్లకు తాళాలు వేసి ఉన్నవి, వలస వెళ్లిన కారణంగా పింఛన్ తీసుకోలేని లబ్ధిదారులకు సోమ, మంగళవారాల్లో పంపిణీ చేయనున్నారు.

గెడ్డ దాటి వెళ్లి...



పింఛన్లు పంపిణీ చేయడానికి గెడ్డ దాటి వెళ్లిన సిబ్బంది

దేవరాపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపూడి పంచాయతీలోని శివారు గ్రామాల్లో శనివారం పింఛన్లు పంపిణీ చేయడానికి సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తున్నా లెక్క చేయకుండా మత్స్యశాఖ గ్రామ సహాయకుడు అబ్దుల్ రజాక్, ఉద్యాన వన శాఖ సహాయకుడు డి.వరుణ్‌కుమార్ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ముందుగా దేవరాపల్లి నుంచి 15 కిలోమీటర్లు ప్రయాణించి బోడిగరువు, నేరెళ్లపూడి వెళ్లారు. అక్కడ నుంచి సమ్మెద గ్రామానికి రహదారి లేకపోవడంతో కాలినడకన ఐదు కిలోమీటర్లు వెళ్లారు. అక్కడ ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ దాటి ఆ గ్రామానికి వెళ్లి 21 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్థుడి సహాయంతో గెడ్డ దాటి ఇవతలి వైపునకు వచ్చారు.

నేటి నుంచి రేషన్ డిపోల్లో సరకుల పంపిణీ

సన్నద్ధమవుతున్న డీలర్లు

- తూనిక యంత్రాలను తనిఖీ చేసిన అధికారులు

అనకాపల్లి టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల తరువాత రేషన్ డిపోల డీలర్లు తమ దుకాణాల ద్వారా కార్డుదారులకు సరకులు పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఒకటో తేదీ నుంచి సరకుల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం రేషన్ డిపోల ద్వారా కాకుండా వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ సరకుల పంపిణీ అని చెప్పి రోడ్లపైనే ఎండలో నిలబెట్టి పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం వచ్చాక కార్డుదారులు పడుతున్న ఇబ్బందులను గుర్తించింది. రేషన్ పంపిణీ వాహనాలు ఎప్పుడు వస్తాయో?, ఎక్కడ ఉంటాయో తెలియక రోజువారీ కూలీలు పనులు మానుకొని నిరీక్షించడం, కొందరు రేషన్ సరకులు తీసుకోకపోవడాన్ని ప్రభుత్వం గమనించింది. దీంతో ఎండీయూ వ్యవస్థను రద్దు చేసి రేషన్ డిపోల ద్వారానే సరకుల పంపిణీకి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నాలుగేళ్లుగా వినియోగంలో లేని ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలు సరిగా పనిచేస్తున్నది?, లేనిది? తూనికలు కొలతల శాఖ అధికారులతో డీలర్లు గత రెండు రోజులుగా తనిఖీలు చేయించుకోవడం ప్రారంభించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తూనికలు కొలతల శాఖ అధికారి శ్రీనివాస్ అనకాపల్లి, కశింకోట, మునగపాక మండలాలకు చెందిన రేషన్‌డీలర్ల ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలను తనిఖీ చేసి రేషన్ సరఫరాలో ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఈ మూడు మండలాలకు చెందిన 137 యంత్రాలను తనిఖీలు చేసి లబ్ధిదారులకు తూకంలో నష్టం కలగకుండా వాటిని సరి చేసి డీలర్లకు అందజేశారు.



తూనిక యంత్రాలను తనిఖీ చేస్తున్న అధికారి శ్రీనివాస్

సక్రమంగా సరకులు పంపిణీ జరగాలి

అనకాపల్లి: జిల్లాలో అన్ని రేషన్ దుకాణాల ద్వారా సరకులు సక్రమంగా పంపిణీ జరిగేలా మండలాధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో 1,069 చౌక దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ జరగాలన్నారు. జూన్ 1 నుంచి 15వ తేదీ ... మిగతా 8వ పేజీలో

పుస్తకాలు వచ్చేశాయ్

పాఠశాలల పునఃప్రారంభం రోజు పంపిణీకి ఏర్పాట్లు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి) పాఠశాలలు తెరిచే సమయానికి విద్యార్థులకు పుస్తకాలతో పాటు బ్యాగు, యూనిఫారం, షూ, బెల్టుతో కూడిన కిట్ అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ముందుగా ఇండెంట్ మేరకు జిల్లాకు పుస్తకాలు వచ్చాయి. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం నాటికి అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు వీటిని అందజేయనున్నారు. జిల్లాలో 5,13,837 పాఠ్య పుస్తకాలు అవసరమని ఇండెంట్ పెట్టారు. ఇప్పటికే 5,13,654 పుస్తకాలు జిల్లాకు చేరాయి. నోట్‌పుస్తకాలు 6,90,528 అవసరం కాగా, అన్ని పుస్తకాలు వచ్చాయి. బెల్టులు 60,901, ఆక్స్‌ఫర్డ్ ఆంగ్లం- తెలుగు అనువాద నిఘంటువులు 9,784 అవసరం కాగా, ఇప్పటికే శత శాతం జిల్లాకు చేరాయి. వీటిని జిల్లా సమగ్ర శిక్షా అధికారులు మండల విద్యాశాఖాధికారుల ఇండెంట్ ప్రకారం పంపుతున్నారు. ఈసారి పుస్తకాలు, ఇతరత్రా స్కూల్ కిట్లలోని సామగ్రి రవాణాకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తోంది. జిల్లాకు ఈ ఏడాది 96,807 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి మూడేసి జతలు చొప్పున యూనిఫారాలు అందజేయాలని ఇండెంట్ పెట్టారు. అలాగే 96,807 స్కూల్ బ్యాగ్స్, 96,642 షూ అందజేయాలని ఇండెంట్ పెట్టారు. ఇవి జిల్లా కేంద్రం గోదాముకు ఇంకా చేరలేదు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి వీటిని అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సమగ్ర శిక్షా ఏపీసీ ఆర్.జయప్రకాశ్ తెలిపారు.



పాఠశాలలకు పుస్తకాలు తరలిస్తున్న చిత్రం

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

కానిస్టేబుళ్ల ఎంపికకు నేడు మెయిన్స్ పరీక్ష

- విశాఖ జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 12,491 మంది అభ్యర్థులు హాజరు
- గంట ముందు కేంద్రానికి చేరుకోవాలని సూచించిన అధికారులు

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియలో భాగంగా ఆదివారం మెయిన్స్ పరీక్ష జరగనున్నది. ఉమ్మడి విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయ నగరం జిల్లాలకు చెందిన 12,491 మంది నగరంలో పరీక్ష రాయనున్నారు. వారికోసం 27 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట ఏర్పాట్లు చేసినట్టు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆయన ఆదేశాలతో డీసీపీలు అజితా వేజెండ్ల, డి.మేరీ ప్రశాంతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 6,100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కోసం 2022 నవంబరులో నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. అనేక కారణాల వల్ల నియామక ప్రక్రియలో జాప్యం ... మిగతా 8వ పేజీలో

బెల్ట్ షాపుపై 'ఎన్‌ఫోర్స్‌మెంట్' దాడి

» 53 మద్యం సీసాలు స్వాధీనం » ఒకరు అదుపులోకి..



ఎంజేపురంలో బెల్ట్ షాపుపై దాడి చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది

అచ్యుతాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంజేపురంలో బెల్ట్ షాపుపై జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం దాడి చేసి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే 53 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ షాపుపై గ్రామస్థులు అచ్యుతాపురం పోలీసులతో పాటు ఎలమంచిలి ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఆశ్రయించారు. దీంతో వారు దాడులు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో పరదేశి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుంటున్న లాలం భవానీ

రాంబిల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లాలంకోడూరులో పరదేశి అమ్మవారి నూతన ఆలయ ప్రారంభోత్సవం శనివారం అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రతిష్ఠించారు. జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ లాలం భవానీ తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.

'పౌర హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించాలి'



పౌరహక్కుల దినోత్సవంలో మాట్లాడుతున్న పరిశీలకుడు అప్పారావు

మునగపాక, మే 31 (ఆంధ్రజ్యోతి) : పౌరుల హక్కులను అంతా గౌరవించాలని జిల్లా పౌర హక్కుల పరిశీలకుడు బొడ్డేడ అప్పారావు అన్నారు. మండలంలో అరబుపాలెంలో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఆయన అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. ఎటువంటి వివక్ష లేకుండా అంతా సోదరభావంతో మెలగాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శేషుబాబు, మండల పరిషత్ కార్యాలయ ఏవో ప్రసాదకుమార్, సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, దళిత నాయకులు పాల్గొన్నారు.

» ఎలమంచిలి మండలంలో ఏర్పాట్లు పూర్తి

» వే మిషన్లు, ఈ-పోస్ యంత్రాలను తనిఖీ చేయించుకున్న డీలర్లు

» 40 డిపోల ద్వారా 21,299 మంది కార్డుదారులకు సరకులు

రేషన్ పంపిణీకి రెడీ..





ఎలమంచిలి తహసీల్దార్ కార్యాలయం ఆవరణ శనివారం రేషన్ డీలర్లతో కోలాహలంగా మారింది. ఆదివారం నుంచి చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీని ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేపట్టిన నేపథ్యంలో డీలర్లు వే మిషన్లతో పాటు ఈ-పోస్ యంత్రాలను తీసుకు వచ్చారు. అవి సక్రమంగా పనిచేస్తున్నదీ లేనిదీ తనిఖీ చేయించుకున్నారు. అలాగే, సిగ్నలింగ్ వ్యవస్థ సరిగా లేకపోతే చేపట్టాల్సిన చర్యలు తదితర సందేహాలను నివృత్తి చేసుకున్నారు. మండలంలో 40 రేషన్ డిపోల ద్వారా 21,299 మంది కార్డుదారులకు నెలనెలా సరకులు పంపిణీ చేయనున్నామని రెవెన్యూ అధికారులు తెలిపారు. - ఎలమంచిలి

'వీర వనిత రాణి అహల్యా భాయి'



అహల్యా భాయి జయంత్యుత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎలమంచిలి, మే 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొత్తపేట రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో శనివారం రాణి అహల్యా భాయి హోల్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ అహల్యా భాయి మహిళల్లో దాగి ఉన్న అసాధారణ శక్తిసామర్థ్యాలను బాహ్య ప్రపంచానికి చాటి చెప్పిన వీర వనితగా కొనియాడారు. పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ అహల్యా భాయి సేవలు అజరామరం అన్నారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. రామలింగేశ్వర ఆలయంలో ఏర్పాటైన సహస్ర దీపారాధనలో మహిళలతో కలిసి ఎమ్మెల్యే దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి కాశీరాజు, రవిరాజు, పట్టాభి ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ ఆడారి శ్రీధర్, మాజీ ఎంపీటీసీ లంక రాజు, న్యాయవాది కూనిశెట్టి శ్రీనివాసరావు, విశ్రాంత అధ్యాపకులు ఆడారి పూరి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

3న పెదపల్లిలో వేమాంబిక జాతర

ఎలమంచిలి, మే 31 : మునిసిపాలిటీ పరిధి పెదపల్లిలో గల వేమాంబిక అమ్మవారి జాతర జూన్ మూడో తేదీన జరగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు శనివారం ఇక్కడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేడుకను ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేపడుతున్నట్టు చెప్పారు.

పండగలా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



మార్టూరులో పింఛన్ అందిస్తున్న రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ

అచ్యుతాపురం/రాంబిల్లి/ఎలమంచిలి/మునగపాక, మే 31 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సమ ప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని మార్టూరులో శనివారం ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిస్తున్నారన్నారు. ఇదిలావుంటే, దిబ్బపాలెంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు భైలపూడి శ్రీరామ దాసు, గుర్రం గోవింద్, కలాం పోతురాజు, బద్ది నర్సింగరావు, గున్నాల లచ్చిబాబు, కొమ్మోజు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి మండలం హరిపురంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలకు కట్టుబడి ప్రభుత్వం పని చేస్తున్నట్టు చెప్పారు. లోవపాలెంలో తెలుగుయువత మండల అధ్యక్షుడు ఎరుపల్లి అజయ్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు చెల్లూరి ఆనంద్, పార్టీ సీనియర్ నాయకులు ఎరిపల్లి చిట్టిబాబులు అధికారులతో కలిసి పింఛన్లను అందజేశారు. అలాగే, ఎలమంచిలి మునిసిపాలిటీ పరిధి కొక్కిరాపల్లిలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పింఛన్ల పంపిణీ చేట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను లబ్ధిదారులకు వివరించారు. పలు వార్డులతో పాటు మండలంలోని గ్రామ గ్రామాన నాయకులు పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. మునగపాక మండల వ్యాప్తంగా శనివారం సాయంత్రం నాలుగు గంటల సమయానికి 94 శాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తి చేశామని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కూటమి శ్రేణులు దాడి మునిలినాయుడు, పెంటకోట విజయ్, టెక్కలి పరశురాం, దాడి శివ, పెంటకోట శ్రీరామ్మూర్తి, ఆడారి గణేష్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేదమంత్రాల నడుమ ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్ఠ

అచ్యుతాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఇందిరమ్మ కాలనీలో శనివా రం ఆంజనేయ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఈ వేడుకను జరిపించారు. రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భైలపూడి శ్రీరామ దాసు, రాజాన విజయ్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సన్యాసి నాయుడు, పైల రామునాయుడు, కూనిశెట్టి రమణ, కూండ్రపు వెంకునాయుడు, తుమ్మల రాజు, మడగల శివతో పాటు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, సెజ్ పునరావాస కాలనీ దిబ్బపాలెంలో గల ఐశ్వర్య నర్మదేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శక్తివేల్ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సహిత కాలభైరవ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దంపతులు పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వెదురువాడలో పౌర హక్కులపై అవగాహన

అచ్యుతాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి) : వెదురువాడ ఎస్సీ కాలనీలో శనివారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ శ్యామ్‌కుమార్ పౌర హక్కుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొయ్య శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ రాజేష్, శీరా శ్రీను, చిరంజీవి, బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలపై శిక్షణ

అచ్యుతాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి) : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా శిక్షకుడు సత్యనారాయణ అన్నారు. శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శనివారం యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సంతలో ఎట్టకేలకు పారిశుధ్య పనులు

ఎలమంచిలి, మే 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని ధర్మవరం వారపు సంతను మునిసిపల్ పారిశుధ్య సిబ్బంది తీర్చిదిద్దారు. 'వారపు సంత'పై శీతకన్ను శీర్షికతో శనివారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నికి అధికారులు వెను వెంటనే స్పందించారు. ఇందులో భాగంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు పర్యవేక్షణలో సుమారు పదిహేను మంది పారిశుధ్య సిబ్బంది, యంత్రాల సహాయంలో సంత ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు.

యాంత్రీకరణతో సాగు ఖర్చు, సమయం ఆదా

» రాజమండ్రి వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త ప్రభాకర్



నామవరంలో నిర్వహించిన వికసిత కృషిలో శాస్త్రవేత్తలు, రైతులు

పాయకరావుపేట రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆధునిక యాంత్రీకరణతో వ్యవసాయంలో సాగు ఖర్చులు తగ్గించుకుని, లాభాలు ఆర్జించవచ్చని రాజమండ్రి వ్యవసాయ పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్ అన్నారు. వికసిత కృషి సంకల్ప అభయాన్‌లో భాగంగా బి.సి.టి. కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం మండలంలోని గోపాలపట్నం, నామవరం, సీతారాంపురం, పి.ఎల్.పురం గ్రామాలలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రభాకర్ మాట్లాడుతూ వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు సమయం, సాగు ఖర్చులు ఆదా అవుతాయన్నారు. ఈ సందర్భంగా కొబ్బరిలో అధిక దిగుబడినిచ్చే విత్తన ఎంపిక, యాజమాన్య పద్ధతులు, తోటలలో భూసార పరిరక్షణకు అంతర పంటల యాజమాన్యంపై రైతులకు వివరించారు. బి.సి.టి. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బండి నాగేంద్రప్రసాద్, ఎం.శివ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారాఆరోగ్యకర పంటలు పండించుకోవచ్చన్నారు. పచ్చి రొట్టల ఎరువుల ప్రాధాన్యం వివరించారు. కొబ్బరిలో బోరాన్, పొటాషియం పోషకాలను అందిం చడం ద్వారా తట్టుకాయలను నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏవో పి.ఆదినారాయణ, రైతు సేవా కేంద్రాల సిబ్బంది సతీశ్, శిరీష, శ్రవణ్, హరికృష్ణ, సర్పంచ్ వెంకటకృష్ణ, టీడీపీ నాయకుడు కురందాసు శివ, మాజీ సర్పంచ్ పల్లా బాబూరావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

'సంపద' కేంద్రాలను వినియోగించాలి



గోపాలపట్నంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో

పాయకరావుపేట రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగించాలని డిప్యూటీ ఎంపీడీవో సీహెచ్. చంద్రశేఖర రావు అన్నారు. మండలంలోని పెంటకోట, మంగవరం, గోపాలపట్నం నామవరం గ్రా మాలలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తాచెదారాలను సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. వీటితో తయారైన వర్మీ కంపోష్టును కొనుగోలు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇళ్ల నుంచి తడి చె త్త, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలని ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లోత ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కొండలరావు, మల్లిఖార్జునాచారి, నాగమణి, టి.వి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

నక్కపల్లి,మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగిత హైవే వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు తీవ్రంగా గాయపడినట్టు స్థానిక పోలీసులు చెప్పారు. తుని మండలం మరువాడకు చెందిన దొరబాబు, అతని స్నేహితుడు రమేశ్ బైక్‌పై అనకాపల్లి వస్తుండగా కాగిత వద్ద వారిని లారీ ఢీ కొట్టింది. దొరబాబు కాళ్లపై నుంచి లారీ వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తుని ఆస్పత్రికి చికిత్స కోసం తరలించి కేసు నమోదు చేసినట్టు పోలీసులు చెప్పారు.

'పల్లె పండుగ'తో అభివృద్ధి పనులు

» 'పేట' నియోజకవర్గంలో రూ.8 కోట్లతో 318 పనులు

» పూర్తయినవి 180 పనులు

» బిల్లుల చెల్లింపులో జాప్యం.. కాంట్రాక్టర్లకు అవస్థలు

» కేంద్రం నుంచి నిధుల విడుదల కాకపోవడంతో సమస్య



వెంకటనగరంలో జనవరిలో సముద్ర తీరానికి వేసిన సీసీరోడ్డు

పాయకరావుపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట నియోజక వర్గ పరిధిలో 'పల్లె పండుగ' కార్యక్రమంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు చురుగ్గా చేపట్టారు. అయితే, ఈ పనులకు సంబంధించి బిల్లుల కోసం కాంట్రాక్టర్లు ఎదురు చూడాల్సి వస్తోంది. నెలల తరబడి బిల్లులు మం జూరు కాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, మరమ్మతులు చేపట్టారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో సుమారు రూ. 8 కోట్లతో 318 అభివృద్ధి పనులు చేప ట్టాలని నిర్ణయించారు. ఈ నిర్మాణాలు పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు త్వరిత గతిన బిల్లుల చెల్లింపులు జరుగుతుందని అధికారులు చెప్పడంతో నామినేటెడ్ విధానంలో గ్రామస్థాయిలో అధికార పార్టీ నాయకులు, కార్య కర్తలు ముందుకువచ్చారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్‌గా చేపట్టిన ఈ పనులకు మొదట్లో బిల్లులు మంజూరైనా ఆ త రువాత నుంచి కాలేదు. దీంతో గత జనవరిలో పూర్తిచేసిన పలు సీసీ రోడ్లతోపాటు ఆ తరువాత పూర్తిచేసిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులు బిల్లులు అప్‌లోడ్‌చేసినా ఇప్పటికీ బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



పాయకరావుపేటలో పల్లె పండుగలో వేసిన సీసీ రోడ్డు

రూ. 4 కోట్లు చెల్లింపు: పీఆర్ డీఈఈ హరి

దీనిపై పీఆర్ డీఈఈ హరిని వివరణ కోరగా నాలుగు మండలాల్లో రూ.8 కోట్లతో 318 రోడ్లు అభివృద్ధి పనులు చేపట్టగా... ఇప్పటి వరకు 180 పూర్తయ్యాయన్నారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నట్టు పేర్కొన్నారు. పూర్తయిన పనులకు సంబంధించి బిల్లులు అప్‌లోడ్‌చేయగా ఇప్పటి వరకు బకాయిలు ఇంకా సుమారు రూ.4 కోట్లు మంజూరు కావాల్సి ఉందన్నారు. ఈ నిధులు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉన్నందున వచ్చే 15వ తేదీ తరువాత విడుదయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

'పేట'లో 90 శాతం పింఛన్ల పంపిణీ

పాయకరావుపేట, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శనివారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ 90 శాతం పూర్తయింది. జూన్ 1వ తేదీ ఆదివారం సెలవుదినం కావడంతో ముందుగానే పింఛన్ల పంపిణీ చేశారు. తెల్లవారుజాము నుంచి సచివాలయాల ఉద్యోగులు పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. ఎంపీడీఓ ఎ. జయప్రకాశరావు, ఈఓపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్‌తోపాటు పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ , మండలంలోని 24 పంచాయతీల్లో జూన్ నెలకు సంబంధించి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర కేటగిరీలకు చెందిన మొత్తం 12,706 మంది పింఛనుదారులకు మొత్తం రూ.5,31,42,500లు పంపిణీ చేయాల్సి ఉండగా శనివారం సాయంత్రానికి 90 శాతం పూర్తయినట్టు వివరించారు.

15న రేవు పోలవరంలో 1500 మందితో యోగాసనాలు

» హోం మంత్రి అనిత



యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం సముద్రతీరం వద్ద జూన్ 15 వ తేదీన సుమారు 1500 మందితో యోగా ప్రొటోకాల్ ఆసనాలపై శిక్షణ అందించనున్నట్టు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్‌డీఏ ప్రభుత్వాలు యోగ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. శనివారం ఉద్దండపురంలో నిర్వహించిన యోగాంధ్ర అవగాహన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టూరిజం ప్రాంతాల్లో సామూహికంగా యోగాసనాల కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. ఇప్పటికే విస్తృత ప్రచారం జరుగుతోందన్నారు. ప్రజలంతా చక్కని ఆరోగ్యంతో ఉండాలన్న ఉద్దేశంతో గ్రామ స్థాయి నుంచి యోగా శిక్షణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకుని విశాఖలో 5 లక్షల మందితో యోగాసనాల కార్యక్రమం చేపడుతున్నామని, దీనికి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు హాజరవుతారన్నారు. పాఠశాల స్థాయి నుంచి యోగాకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డీ సీతారామరాజు, యోగా గురువు రాంబాబు, నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, గెడ్డం బుజ్జి, అబద్దం, గింజాల లక్ష్మణరావు, కొప్పిశెట్టి బుజ్జి, మేరుగు నాగేశ్వరరావు, గోసల చినతాతారావు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



వమ్మవరంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఎస్. రాయవరం, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వమ్మవరంలో నిర్వహిస్తున్న మహిళల కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని శనివారం ఎంపీడీవో జి. సత్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలతో ఎంపీడీవో మాట్లాడి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పల్లెల జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు యోగా శిక్షణ



యోగా శిక్షణ పొందుతున్న ఉద్యోగులు

నక్కపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద శనివారం సాయంత్రం పలు ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు ప్రొటోకాల్ యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి ప్రసాద్, తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీడీవో డీ సీతారామరాజు పర్యవేక్షించారు. యోగా గురువు దవరసింగి రాంబాబు , డీఎన్‌వీ సాయి నేతృత్వంలో మాస్టర్ ట్రైనీ ఆదిత్య రుత్విక్ తదితరులు ప్రొటోకాల్ యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో సీతారామరాజు మాట్లాడారు. యోగాంధ్రలో రిజిస్ట్రేషన్లు పెంచాలని, ఆదివారం సెలవును కూడా రద్దు చేశారని,మరో రెండు రోజుల పాటు యోగా ప్రొటోకాల్ శిక్షణ వుంటుందన్నారు.

ఉపాధి కూలీలకు యోగా రిజిస్ట్రేషన్లు



కేవెంకటాపురంలో కూలీలకు రిజిస్ట్రేషన్ చేస్తున్న ఉపాధి సిబ్బంది

కోటవురట్ల, మే 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు యోగాంధ్ర రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంచేస్తున్నారు. మండలం 25 గ్రామ పంచాయతీల్లో ఎన్‌ఆర్‌జీఎస్ టెక్నికల్ అసిస్టెంట్స్ , వీఆర్‌పీ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి యోగా వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తున్నారు. యోగాతో ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఉపాధి పథకం ఏపీవో నాగరాజుమాట్లాడుతూ కూలీలు వారి కుటుంబసభ్యులతో యోగా రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూడాలన్నారు. మండలంలో 5వేలు మంది కూలీలకు రిజిస్ట్రేషన్ చేయాలని నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. ఇప్పటివరకు 6వేలు మందికి నమోదుచేశామన్నారు. ప్రస్తుతం మరో 1500 రిజిస్ట్రేషన్లు పూర్తికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నేరం

▸ చట్టాన్ని ఉల్లంఘిస్తే మూడు సంవత్సరాలు జైలు ▸ బాలికలను కాపాడుకోవాలి ▸ డివిజన్‌స్థాయి కమిటీ సమావేశంలో ఆర్డీవో ఆయిషా



డివిజన్‌స్థాయి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో షేక్ ఆయిషా

అనకాపల్లి టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నేరమని, ఇటువంటి పరీక్షలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్డీవో షేక్ ఆయిషా స్పష్టం చేశారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం అమలుపై డివిజన్‌స్థాయి కమిటీ సమావేశాన్ని శనివారం ఇక్కడ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం 1994 కఠినంగా అమలు జరిగేలా అధికారులు పర్యవేక్షణ జరపాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం లింగ నిష్పత్తి వెయ్యి మంది బాలురు, 972 బాలికలుగా ఉందన్నారు. డివిజన్‌లో పారిశ్రామిక, గిరిజన, మత్స్యకార, మైదాన ప్రాంతాలు ఉన్నాయని, ఆయా ప్రాంతాల వారీగా లింగ నిష్పత్తి నివేదికలు తయారు చేయాలని సూచించారు. దీని ద్వారా ఆయా ప్రాంతాలకు తగినట్లుగా ప్రచారం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు పోలీస్, శిశు సంక్షేమ, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎక్కడైనా లింగ నిర్ధారణ జరిగితే తెలుసుకునేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంక్షేమ పోలీసుల సేవలు వినియోగించుకోవాలని సూచించారు. బాలికలను కాపాడుకోవాలని, వారిపై వివక్ష లేకుండా చూడాలని పేర్కొన్నారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు నేరమన్నారు. లేబొరేటరీల్లో గాని, స్కానింగ్ కేంద్రాల్లో గాని ఇటువంటి పరీక్షలు జరిపినట్టు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారికి మూడు సంవత్సరాలు జైలు శిక్ష, పది వేల రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా ఆడ శిశువు అని తెలిసి గర్భస్రావాలు చేయించడం వంటి సమాచారం తెలిస్తే 102, 104 టోల్ ఫ్రీ నంబరుకు లేదా ఆన్‌లైన్ గ్రీవియన్స్ (పీసీపీఎన్‌డీటీ.ఏపీ.జీవోవీ.ఐఎన్) ద్వారా తెలియజేయవచ్చని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, కమిటీ కన్వీనర్ డాక్టర్ కె.చంద్రశేఖర దేవ్, పట్టణ ఎస్‌ఐ డి.ఈశ్వరరావు, సుమిధ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డి.వీరభద్రరావు, ఎమినెంట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డి.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి



జైలు సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న న్యాయమూర్తి ధర్మారావు

అనకాపల్లి టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సబ్ జైలును ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికారి ధర్మారావు శనివారం సందర్శించారు. పదో అదనపు జిల్లా జడ్జి నరేష్ ఆదేశాల మేరకు విచ్చేసిన ఆయన నిందితులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. పలువురు నిందితులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్య సమస్యలుంటే వైద్యులకు చూపించాలని అధికారులను ఆదేశించారు. బెయిల్ కోసం న్యాయ సహాయకులను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ కిరణ్, న్యాయ సహాయకులు తులసి, సాయిరాం, ఎంఎల్ఎస్‌సీ ప్రతినిధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అహల్య భాయి హోల్కర్ జయంతి



అహల్యభాయి హోల్కర్ చిత్రపటం వద్ద బీజేపీ శ్రేణుల నివాళి

కొత్తూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : అహల్యభాయి హోల్కర్ జయంతిని ఇక్కడి బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగమణి ముఖ్య అతిథిగా హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అహల్యభాయి హోల్కర్ దేశంలో అనేక హిందూ దేవాలయాలను పునర్నిర్మాణం చేయడం ద్వారా సేవ, ధర్మపరిరక్షణ, ఆధ్యాత్మికతకు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కొండబాబు, ఉపాధ్యక్షుడు ఉడా రమేష్, అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు కె.సన్యాసిరావు, ఎ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పది మద్యం సీసాలు స్వాధీనం : ఒకరిపై కేసు

అనకాపల్లి టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఓవ్యక్తి నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. రజక కాలనీకి చెందిన బాదంపూడి నాగేశ్వరరావు శనివారం మద్యం దుకాణంలో పది మద్యం క్వార్టర్ బాటిళ్లను కొనుగోలు చేసి ఇంటి వైపు వెళుతున్నాడన్నారు. నూకాంబిక ఆలయం వద్దకు వచ్చేసరికి అనుమానం వచ్చి తనిఖీ చేశామన్నారు. మద్యం బాటిళ్లు పట్టుబడడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

4న ప్రభుత్వ వైఫల్యాలపై ఆందోళన : వైసీపీ నేతలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసీపీ నేతలు

అనకాపల్లి టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించలేదని వైసీపీ నేతలు ఆరోపించారు. ఇందుకు నిరసనగా జూన్ నాలుగో తేదీన వెన్నుపోటు దినంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శనివారం ఇక్కడి రింగురోడ్డులోని కార్యాలయంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, పరిశీలకురాలు శోభా హైమావతి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఎ.అదీప్‌రాజ్, కంబాల జోగులు, పెట్ల ఉమా శంకర్ గణేశ్, అరకు నియోజకవర్గ పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్, పార్టీ నాయకులు దంతులూరి దిలీప్‌కుమార్, మందపాటి జానకిరామరాజు, కేఎం నాయుడు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సుజాత, అనకాపల్లి, కశింకోట, అనకాపల్లి పట్టణ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీకి పలువురి రాజీనామా

పార్టీ నాయకుల మధ్య కొందరు విభేదాలు సృష్టిస్తున్నారని ఆవేదన



రాజీనామా పత్రాలను చూపుతున్న దుర్గినాయుడు, చంద్రశేఖర్ తదితరులు

సబ్బవరం, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరం, పైడివాడ అగ్రహారం, పెదనాయుడుపాలెం గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకీ, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పైడివాడ అగ్రహారం ఎంపీటీసీ శీరం అప్పలరాజు, మాజీ ఎంపీటీసీ అక్కిరెడ్డి రామలక్ష్మి, ఆమె భర్త దుర్గినాయుడు, నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి రోమాల చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామాల్లో కొంత మంది కోవర్టులుగా వ్యవహరించి పార్టీ నాయకుల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన గ్రామ కమిటీ ఎన్నికల్లో తమకు సమాచారం ఇవ్వలేదని దుర్గినాయుడు ఆరోపించారు. గ్రామాల్లో సమస్యలు నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీకి తెలియజేసేందుకు ప్రయత్నించినా అవకాశం ఇవ్వలేదన్నారు. తమ రాజీనామా పత్రాలను రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు పంపనున్నామన్నారు. రాజీనామ చేసినవారిలో మాజీ సర్పంచ్ పట్నాల లక్ష్మి, మాజీ ఉప సర్పంచులు బొబ్బరి సత్యారావు, గంధ్రెడ్డి వెంకటరమణలతో గొంతిన జగదీష్, పైడిరాజు, సబ్బవరపు ఎర్నాయుడు, బోకం సన్యాశిరావు, గండి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

'యోగా నిరంతర ప్రక్రియ కావాలి'



యోగా చేస్తున్న డ్వాక్రా మహిళలు



యోగాసనాలు వేస్తున్న మాజీ సైనికులు

అనకాపల్లి టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మానసిన ప్రశాంతత లభిస్తుందని ఆర్డీవో షేక్ ఆయిషా అన్నారు. శనివారం ఇక్కడి రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జిల్లాలో ఉన్న మాజీ సైనికులతో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా నిత్యం చేసే పనుల్లో ఓ భాగంగా కావాలన్నారు. అనంతరం యోగా గురువులు బి.అప్పారావు, మంగయ్య యోగాసనాలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, జిల్లా సైనిక సంక్షేమ శాఖాధికారి కృష్ణారావు, మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే గవరపాలెం సతకంపట్టు జీవీఎంసీ పాఠశాల ఆవరణలో ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి రోజు ప్రతి ఒక్కరూ యోగాసనాలు వేయాలని, దీనివల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని ప్రభావతి వివరించారు. ఈ కార్యక్రమంలో డి. లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ యూత్ వింగ్ జనరల్ సెక్రటరీగా సురేష్‌రాజ్



సబ్బవరం, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆరిపాక శివారు లగిశెట్టిపాలెం గ్రామానికి చెందిన పాలిశెట్టి సురేష్‌రాజ్ వైసీపీ రాష్ట్ర యూత్ వింగ్ జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఈ మేరకు అధిష్ఠానం నుంచి శనివారం ఆదేశాలు అందినట్టు ఆయన చెప్పారు. ఇంతకు ముందు పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా పని చేశారు. ఈ పదవికి ఎంపిక చేసినందుకు జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులతో మేలు



డ్రోన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

సబ్బవరం, మే 31 (ఆంధ్రజ్యోతి) : సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులను అవలంబించడం ద్వారా అధిక దిగు బడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. నారపాడు, అమృతపురం గ్రామాల్లో శనివారం నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో మాట్లాడారు. రైతుల సంక్షేమానికి కేంద్రం అమలు చేస్తున్న కార్య క్రమాలు, భూసార పరీక్షల ఉపయోగాలను వివరించారు. శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు సూచనలను రైతులు పాటించాలన్నారు. ఆధునిక పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జిల్లా ఉద్యాన అధికారి ప్రభాకరరావు మాట్లాడుతూ ఉద్యాన పంటలకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను వివరించారు. జిల్లా నోడల్ ఆఫీసర్, కొం డెంపూడి కృషి విజ్ఞాన పరిశోధన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాజ్‌కుమార్ మాట్లా డుతూ పంటల సాగు, పురుగులు, తెగుళ్ల నివారించడంలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. డాక్టర్ సౌజన్య, పలువురు శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వరి పంట సాగులో నూతన రకాలైన ఎంటీయూ- 1224, ఎంటీయూ-1262, బీపీటీ-2295, బీపీటీ- 2846, ఎంటీయూ-1318 రకాలు తదితరాలను తెలియజేశారు. డాక్టర్ వెంకటేశం, టి.కిరణ్ మాట్లాడుతూ డ్రోన్ల సహకారంతో ఎరువులు, పురుగుల మందులు పిచికారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.సత్తిబాబు, డాక్టర్ ఎ.సౌజన్య, డాక్టర్ కిశోర్, ఏవో పోతల సత్యనారాయణ, ఏఈవో బాలరాజులతో పాటు రైతులు పాల్గొన్నారు.

స్పాట్ వాల్యూయేషన్ నుంచి టీచర్లను మినహాయించాలి

▸ డీఈవోకి యూటీఎఫ్ ప్రతినిధి వినతి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న చినబ్బాయి

అనకాపల్లి టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తప్పనిసరి బదిలీల్లో ఉన్న స్కూల్ అసిస్టెంట్లను టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల స్పాట్‌వాల్యూయేషన్ నుంచి మినహాయించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి శనివారం డీఈవో అప్పారావు నాయుడుకు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. జూన్ ఒకటి, రెండు తేదీల్లో స్కూల్ అసిస్టెంట్లు బదిలీలు వెబ్ ఆప్షన్ ఇచ్చుకునే పనిలో బిజీగా ఉంటారని, అందువల్ల వారందరినీ స్పాట్ వాల్యూయేషన్ నుంచి మినహాయించాలని డీఈవోను కోరారు. లేదా స్పాట్ వాల్యూయేషన్ రీషెడ్యూల్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వమే బదిలీల షెడ్యూల్‌ను ప్రకటించి మే 31, జూన్ ఒకటి, రెండు తేదీల్లో స్కూల్ అసిస్టెంట్లు అందరినీ తప్పనిసరిగా కంప్యూటర్‌లో వెబ్‌ఆప్షన్ పెట్టుకోవాలని నిర్దేశించి అవే రోజుల్లో మళ్లీ సప్లిమెంటరీ పరీక్ష పేపర్లను మూల్యాంకనం చేయమని చెప్పడం సరికాదన్నారు.

ఘనంగా పైడితల్లమ్మ ఉత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న నాయకులు

సబ్బవరం, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదగొల్లలపాలెంలో పైడితల్లమ్మ పండుగను శనివారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి విశేష అలంకరణలు చేపట్టిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలి రావడంతో కోలాహల వాతావరణం నెలకొంది. సాయంత్రం మేళతాళాలు, కోలాటం, సాముగరిడి, నేల డ్యాన్స్‌లు బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారిని ఊరేగించి అనుపోత్సవాన్ని జరిపారు. రాత్రికి ఏర్పాటైన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు సోదరుడు వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు బలిరెడ్డి అప్పారావు, ఇందలి వెంకటమరణ, స్థానిక నాయకులు కర్రి కనకరాజు, బైలపూడి దేముడు, గొల్లవిల్లి రమణ, వంగలపూడి సంతోష్‌బాబు, బోకం స్వామి నాయుడు, నర్సింగరావు, శేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.

వేతన బకాయిల కోసం ఉపాధి కూలీల ఆందోళన



నినాదాలు చేస్తున్న ఉపాధి కూలీలు

పరవాడ, మే 31 (ఆంధ్రజ్యోతి) : బకాయిపడిన ఎనిమిది వారాల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ పథకం కూలీలు పరవాడ ఊర చెరువు వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కూలీల బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలన్నారు. కూలీల్లో ప్రతి కుటుంబానికి ఏడాదికి రెండు వందల రోజులు పనిదినాలు కల్పించాలని, కేంద్ర బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.రెండు లక్షల కోట్లు కేటాయించాలని, కొలతలతో సంబంధం లేకుండా జీవో ప్రకారం రోజుకు రూ.309 వేతనం చెల్లించాలని, పనిముట్లు ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం కూలీలు లక్ష్మి, సన్యాసమ్మ, రావులమ్మ, కిరణ్, శివలక్ష్మి, మహాలక్ష్మి, పైడమ్మ తదితరులు పాల్గొన్నారు.

రామన్నపాలెం కాలనీలో విద్యుత్ లైట్లు ఏర్పాటు



విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కశింకోట, మే 31 (ఆంధ్రజ్యోతి) : విస్సన్నపేట పంచాయతీ పరిధిలో జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న రామన్నపాలెం కాలనీలో శనివారం విద్యుత్ లైట్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఏర్పాటు చేశారు. 'ప్రగతి వెలుగుల్లేని రామన్నపాలెం' శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి గ్రామ సర్పంచ్ ఉప్పునూరి అప్పారావు వెం టనే స్పందించి ఈ లైట్లు ఏర్పాటు చేయించారు. అంతేకాకుండా వీధిలో కాలువల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను కోరామని చెప్పారు.

పేదల కళ్లలో ఆనందం కని'పింఛెన్'



కశింకోటలోని గవరపేట మధ్య వీధిలో లబ్ధిదారుకు పింఛన్ నగదు అందజేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్



మొగలిపురంలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న బాబ్జీ

కశింకోట, మే 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కశింకోట 13వ వార్డు గవరపేట మధ్య వీధిలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ విజయకృష్ణన్ పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె లబ్ధిదారులతో మాట్లాడారు. పెన్షన్ డబ్బులు పూర్తిగాఅందుతున్నాయా?, పెన్షన్ అందజేస్తున్నప్పుడు సచివాలయ సిబ్బంది డబ్బులు ఏమైనా అడుగుతున్నారా? అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి కె.శచీదేవి, మండల ప్రత్యేకాధికారిణి వీఎల్ సుభాషిణి, తహసీల్దార్ జి.సత్యనారాయణ, ఎంపీడీవో వీవీ రవికుమార్, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం : రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. మండలంలోని మొగలిపురంలో శనివారం ఉదయం పింఛన్ల పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నప్పటికీ పథకాలను సమర్థవంతంగా కొనసాగిస్తున్నామన్నారు. పింఛన్ల పంపిణీలో సబ్బవరం జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచిందని ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. సర్పంచ్ గండి అరుణ, నాయకులు గండి వంశీదీప్, తమరాన బంగారునాయుడు, అంగటి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : పట్టణంలో పింఛన్ల పంపిణీ ఉత్సాహ భరిత వాతావరణంలో సాగింది. 81వ వార్డు పార్కు జంక్షన్, నిదానందొడ్డి, సంతోషిమాత ఆలయం, అగ్గిమర్రి చెట్టు తదితర ప్రాంతాల్లో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర పింఛన్లను పంపిణీ చేశారు. నాయకులు యల్లపు జగన్నాధరావు, మళ్ల సూరిబాబు, పొలమరశెట్టి శ్రీనివాసరావు, కర్రి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

లంకెలపాలెం : జీవీఎంసీ 84వ వార్డు సాలాపువానిపాలెంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణరావు పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. పలువురి ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులకు పంఛన్ల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సాలాపు మోహన్‌రావు, నాయకులు చినవెంకటరమణ, సుమన్ అప్పారావు, గొర్లి గోవింద్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో రేషన్ డిపో ఏర్పాటుకు ఆందోళన



కాలనీవాసులతో కలిసి ఆందోళన చేపడుతున్న ఐద్వా ప్రతినిధులు

పరవాడ, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జేఎన్‌ఎన్‌యూ ఆర్‌ఎం కాలనీలో రేషన్ డిపో ఏర్పాటు చేయాలని ఐద్వా ప్రతినిధులు బంగారమ్మ, అన్నపూర్ణ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో శనివారం ఇక్కడ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ డిపోల ద్వారా సరుకులు పంపిణీ చేస్తామని ప్రకటించినప్పటికీ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో రేషన్ డిపో ఏర్పాటు చేయకపోవడం తగదన్నారు. దీనివల్ల సుమారు రెండు కిలో మీటర్ల దూరం వెళ్లి తాము రేషన్ తెచ్చుకోవాల్సి వస్తుందన్నారు. ఇది కష్టతరమైన పని అని, దీనిని దృష్టిలో పెట్టుకొని కాలనీవాసులకు అందుబాటులో ఉండే విధంగా డిపోను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే, కందిపప్పు, నూనె, మినపప్పు, శనగపప్పు కూడా రేషన్ డిపో ద్వారా అందజేయాలన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు సంతోషి, లావణ్య, మంగమ్మ, సీతామహాలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల వాడకంతో అనారోగ్యం



ర్యాలీ చేస్తున్న ఎన్టీఆర్ వైద్యాలయం వైద్యులు, సిబ్బంది

అనకాపల్లి టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ వైద్యాలయం వైద్యులు, సిబ్బంది శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పొగాకు, దానికి అనుబంధమైన ఖైనీ, గుట్కా వంటి వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలను డీసీహెచ్ఎస్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు వివరించారు. పొగాకుకు సం బంధించిన ఉత్పత్తులు వినియోగించే అలవాటు ఉన్నవారు తక్షణమే నిలిపి వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంవో గౌతమ్, వైద్యులు శ్రీని వాస్, శ్యామల తదితరులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలావుంటే, పొగాకుకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ డీడీ నాయుడు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో వాకర్స్‌తో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ధూమపానం వల్ల తలెత్తే అనారోగ్య సమస్యలను తెలియజేశారు. గుండె జబ్బులు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉన్నందున ధూమపానానికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ మార్కెట్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ, యల్లపు శివ, కాండ్రేగుల జగ్గారావు, శిలపరశెట్టి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కాఫీ బోర్డు ఏడీ అప్పలనాయుడుకు ఘనంగా వీడ్కోలు



అప్పలనాయుడు దంపతులను సత్కరిస్తున్న ఐటీడీఏ అధికారులు

పాడేరు, మే 31(ఆంధ్రజ్యోతి): కాఫీ బోర్డు ఏడీగా బాధ్యతలు నిర్వహించి శనివారం పదవీ విరమణ చేసిన జి.అప్పలనాయుడుకు ఐటీడీఏ, కాఫీ బోర్డు అధికారులు ఘనంగా వీడ్కోలు సభను నిర్వహించారు. ఐటీడీఏ కార్యాలయంలో అప్పలనాయుడు దంపతులకు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, పరిపాలనాధికారి హేమలత, మేనేజర్ పరం జ్యోతి, కాఫీ బోర్డు సీనియర్ లైజన్ అధికారి రమేశ్, ఎస్ఎంఐ సీనియర్ అసిస్టెంట్ జి.సుబ్రహ్మణ్యం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాయిపాడులో వైద్య శిబిరం



దోనెలో గెడ్డ దాటుతున్న వైద్య సిబ్బంది

డుంబ్రిగుడ, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా- ఒడిశా సరిహద్దులోని కంద్రుం పంచాయతీ రాయిపాడు గ్రామంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక వైద్యాధికారులు రాంబాబు, అంబిక ఆధ్వర్యంలో ఇంటింటికీ సందర్శించి పలు వ్యాధులతో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అయితే, ఆ గ్రామంలో చేరుకునేందుకు దోనె సహాయంతో గెడ్డ వాగును దాటారు. అనంతరం కొంతదూరం కాలినడకన చేరుకున్నారు. అనంతరం గ్రామంలో వైద్య సేవలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కనకదుర్గమ్మ ఉత్సవాలు



జోలాపుట్టు ఆలయంలో దుర్గమ్మతల్లి

ముంచంగిపుట్టు, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోలాపుట్టులో ఆదివారం జూన్ 1 నుంచి 3వ తేదీ వరకు శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలను నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు శనివారం తెలిపారు. ఈ మూడు రోజులు పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో పలు సంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. ముగింపు రోజు మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్టు చెప్పారు. భక్తులకు ఎటు వంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.

రామాలయ ప్రహరీ గోడ నిర్మాణానికి ఎంపీ నిధులు



కిండంగి రామాలయంలో సమావేశమైన గ్రామ పెద్దలు, ప్రజలు

పాడేరురూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిండంగి పంచాయతీ కేంద్రంలో ని శ్రీరామ శరణ బాబాజీ స్థాపిత సీతారాముల ఆలయానికి ప్రహరీ నిర్మాణానికి అరకు ఎంపీ డాక్టర్.గుమ్మా తనూజారాణి నిధులను కేటాయించినట్టు సర్పంచ్ కూడా శ్రీలక్ష్మి, తెలుగుదేశం పార్టీ నాయకులు డుంబేరు విశ్వనాథం తెలిపారు. గ్రామానికి చెందిన విశ్రాంతి అడిషనల్ రిజిష్టర్ కో-ఆపరేటివ్ మెంబర్, ఏపీ కో-ఆపరేటివ్ ట్రిబ్యునల్ ఓంద్రు రామ్మూర్తి ఎంపీని కోరడంతో స్పందించిన ఆమె ఎంపీ నిధులు కేటాయించారన్నారు. ఎంపీకి గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణల తొలగింపు

పాడేరురూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): పాడేరు పట్టణంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను తొలగింపు పనులను రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులు పోలీసుల సహకారంతో శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా 10 షాపులను తొలగించారు. మెయిన్ రోడ్డులో ప్రభుత్వ స్థలాలను సుమారు 225 మంది ఆక్రమించినట్టు గుర్తించిన అధికారులు ఇప్పటికే వారికి నోటీసులు జారీ చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా గతంలో సర్వే చేపట్టి మా ర్కిం గ్ చేశారు. అయినా, ఆక్రమణదారులు స్పందించక పోవడంతో మరోసారి అధికారులు మూ డు రోజుల ముందు నోటీసులు జారీ చేశారు. దాంతో కొంత మంది స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించారు. మిగిలిన వారు స్పందించలేదు. దీంతో ఆర్అండ్‌బీ ఈఈ పి.బాలసుందర బాబు, సిబ్బంది, తహసీల్దార్ వంజంగి త్రినాథరావు నాయుడు, ఆర్ఐ బజ్జంగి నల్లన్న పోలీసుల సహకారంతో ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టారు. శనివారం అంబేడ్కర్ కూడలి నుంచి పాత పెట్రోలు బంక్ వరకు గల 10 ఆక్రమణలను తొలగించారు. మిగిలిన వాటికి 7వ తేదీన ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టనున్నట్టు రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు.

చింతపల్లిలో ..

చింతపల్లి: స్థానిక హనుమాన్ జంక్షన్ ప్రారంభంలో ఆర్అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మించిన ప్రహరీ గోడను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు.



చింతపల్లిలో తహసీల్దార్, సీఐ వినోద్‌బాబుతో చర్చిస్తున్న ప్రజాప్రతినిధులు



పాడేరు అంబేడ్కర్ కూడలిలో తొలగిస్తున్న ఆక్రమణలు

హనుమాన్ జంక్షన్ నుంచి డిగ్రీ కళాశాల వరకు రహదారికి ఇరువైపులా 65మంది ఆర్అండ్‌బీ స్థలాల్లో దుకాణాలు, ఇతర కట్టడాలు నిర్మించినట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. తొలివిడతగా 10మందికి దుకాణాల యజమానులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీచేశారు. శనివారం జంక్షన్ ప్రారంభంలో ఓ గృహం ప్రహరీ గోడను కూల్చివేశారు. దీంతో దుకాణాల యజమానులు ఎంపీపీ కోరాబు అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీటీసీ సభ్యురాలు ధారలక్ష్మి తహసీల్దార్, సీఐ ఎం. వినోద్‌బాబు, ఎస్సై వెంకటేశ్వరరావుతో చర్చించారు. వారం సమయం ఇస్తే తామే స్వచ్ఛందంగా కట్టడాలను తొలగిస్తామని విజ్ఞప్తి చేశారు. దీంతో వచ్చే శుక్రవారంనకు తొలగింపును రెవెన్యూ అధికారులు వాయిదా వేశారు.

జి. మాడుగులలో ప్రభుత్వ భూముల స్వాధీనం

జి.మాడుగుల: ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటున్నట్టు తహసీల్దార్ జి. రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో 30 సెంట్లలో ఉన్న ఆక్రమణలను తొలగించినట్టు ఆయన పేర్కొన్నారు. మిగిలిన ప్రాంతాల ఆక్రమణలకు గుర్తించి వాటిని కూడా స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బొర్రా అందాలు అమోఘం

» కేంద్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ విపుల్ ఉజ్వల్



బొర్రాగుహల వద్ద విపుల్ ఉజ్వల్, కుటుంబ సభ్యులు

అనంతగిరి, మే 31 (ఆంధ్రజ్యోతి): సహజసిద్ధంగా ఏర్పడిన బొర్రాగుహల అందాలు అద్భుతంగా ఉన్నాయని కేంద్ర పంచాయతీ రాజ్ డైరెక్టర్ విపుల్ ఉజ్వల్ (ఐఏఎస్) కొనియాడారు. బొర్రాగుహలను ఆయన శనివారం తన కుటుంబ సమేతంగా సందర్శించారు. ముందుగా స్థానిక ఎంపీడీవో ఏవీవీ కుమార్, పరవాడ ఎంపీడీవో రమేశ్‌నాయుడు.. విపుల్ ఉజ్వల్ కుటుంబానికి గిరిజన సంప్రదాయంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్థానిక గైడ్స్ ద్వారా బొర్రాగుహలు చ రిత్రపై ఆయన అడిగితెలుసుకున్నారు. లోపల సహజసిద్ధంగా ఏర్ప డిన గుహలు అందాలు చూసి మరపురాని అనుభూతి కలుగుతుందన్నారు. ఇంత చరిత్ర కలిగిన గుహలు ఉండడంతో ఈ ప్రాం తవాసులు అదృష్టవంతులని కొనియాడారు.

ల్యాండ్ స్కేప్ మేనేజ్‌మెంట్ కమిటీ ఏర్పాటు



డి.గొందూరులో మాట్లాడుతున్న సబల ప్రాజెక్టు డైరెక్టర్ రహీమ్

పాడేరురూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): సబల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం డి.గొందూరు పంచాయతీ కేంద్రంలో ల్యాండ్ స్కేప్ మేనేజ్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసినట్టు ప్రాజెక్టు డైరెక్టర్ రహీమ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండల్లో జీవనం మెరుగుపర్చడం, భూసార క్షీణత నివారణ, జీవనోపాధులు మెరుగుదల, సరైన మార్కెట్ అవకాశాలు కల్పించేలా ప్రభుత్వ, ప్రభుత్వేతర, ప్రజా సంఘాల భాగ్యస్వామ్యంతో పనిచేయడమే ల్యాండ్ స్కేప్ మేనేజ్‌మెంట్ కమిటీ లక్ష్యం అన్నారు. ఈ కమిటీలో మండల స్థాయిలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, వెలుగు ఏపీఎం చిన్నారావు, హార్టికల్చర్ ఆఫీసర్ శరణ్య మాధురి, పశువైద్య శాఖ వీఏఎస్ సురేష్, రెయిన్ ఫారెస్టు అలయన్స్ ప్రతినిధులు వినూత్న, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, సబల్ ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్ డిపోల ద్వారా రేషన్ పంపిణీకి చర్యలు

» జీసీసీ డీఎం వెంకటేష్ వెల్లడి



మాట్లాడుతున్న డీఎం వెంకటేష్

కొయ్యూరు, మే 31 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థ రద్దు నిర్ణయంతో గతంలో మాదిరి డీఆర్ డిపోల ద్వారా నిత్యావసర సరకులు పంపిణీకు వీలుగా పటిష్ట చర్యలు చేపట్టినట్టు చింతపల్లి జీసీసీ డీఎం బి. వెంకటేష్ తెలిపారు.శనివారం స్థానిక బ్రాంచి కార్యాలయంను డీఎం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నెల నుంచి తిరిగి నిత్యావసర సరకుల పంపిణీ పై సేల్స్‌మేన్‌లు, డీలర్లు, ఎస్‌హెచ్‌జీ గ్రూపులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు తిరిగి డిపోల ద్వారా నిత్యావసరాల పంపిణీలో ఏవిధమైన లోపాలు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. డిపోల్లో బియ్యంతో పాటు ప్రజలకు అవసరమయ్యే ఇతర సరకులు అమ్మకాలు జరిపేలా చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే, జీసీసీ ఆధ్వర్యంలో డిపోలు కొన్ని మరమ్మతులకు లోనయ్యాయయన్నారు. దీంతో అద్దె భవనాలలో డిపోలు నిర్వహించుకునేలా చూసుకోవాలని సేల్స్‌మేన్‌లకు సూచించామన్నారు.రానున్న డిసెంబరు నుంచి జీసీసీ ద్వారా సేకరించే అటవీ వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు లక్షాలు నిర్దేశించనున్నట్టు చెప్పారు.

రికార్డు స్థాయిలో కాఫీ కొనుగోలు

చింతపల్లి డివిజన్ పరిధి చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు బ్రాంచీల పరిధిలో రికార్డు స్థాయిలో 7 వేల టన్నుల కాఫీ కొనుగోలు చేసినట్టు డీఎం వెల్లడించారు. బెంగళూరులో లేని ధరను జీసీసీ కల్పించటంతో కాఫీ రైతులు ఎక్కువ శాతం జీసీసీకు విక్రయించేందుకు ముందుకు వచ్చారన్నారు. ప్రప్రథమంగా కొయ్యూరు బ్రాంచీలో 5 టన్నులు కొనుగోలు చేశామన్నారు. పసుపు 40 క్వింటాళ్లు, చింతపండు 20 టన్నులు మాత్రమే కొనుగోలు చేశామన్నారు. బీఎం విజయ్‌కుమార్, అకౌంటెంట్ మల్లేశ్వరావు పాల్గొన్నారు.

జీపుజాత విజయవంతం చేయండి



పోస్టర్ విడుదల చేస్తున్న డీఎస్సీ సాధన సమితి, గిరిజన సంఘం నేతలు

జి.మాడుగుల, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 31 నుంచి జూన్ 4 వరకు నిర్వహించే జీపుజాతను విజయవంతం చేయాలని ప్రత్యేక సాధన సమితి జిల్లా నాయకులు ఎస్. ధర్మనడాల్, ఎం.నారాయణరాజు, ఎల్.రామకృష్ణ కోరారు. ఈ మేరకు వారు శనివారం మండల కేంద్రంలో పోస్టర్‌ని విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఈ యాత్ర మే 31న సీతంపేట ఐటీడీఏ పరిధిలో ప్రారంభమై, సాలూరు మీదుగా అల్లూరి జిల్లా, రాజవొమ్మంగి, రంపచోడవరం చింతూరు ఐటీడీఏలో పర్యటించి ఈనెల 4వ తేదీతో ముగిస్తుందని చెప్పారు. జూన్ 2న జి.మాడుగులలో జరిగే సమావేశానికి ప్రజా సంఘాలు, మేధావులు డీఎస్సీ, బీఈడీ అభ్యర్థులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మత్స్యరాజు, సన్యాసిదొర, సంకయ్య, సూర్యప్రకాశ్‌నాయుడు, చిరంజీవినాయుడు, సింహాచలం పాల్గొన్నారు.

సీలేరు కాంప్లెక్సు జెన్‌కో ఇన్‌చార్జి చీఫ్ ఇంజనీర్‌గా కామేశ్వరరావు



సీలేరు, మే 31 , (ఆంధ్రజ్యోతి) : సీలేరు కాంప్లెక్సు జెన్‌కో ఇన్‌చార్జి చీఫ్ ఇంజనీర్‌గా చిన కామేశ్వరరావు శనివారం అదనపు బాధ్యతలను స్వీకరించారు. సీలేరు కాంప్లెక్సు జెన్‌కో చీఫ్ ఇంజనీర్ కొనసాగిన ఎల్‌వీ స్వామి నాయుడు శనివారం పదవీ విరమణ కావడంతో ఆయన స్థానంలో కొత్త సీఈని నియమించేంత వరకు ఎస్ఈ (ఓఅండ్ఎం)గా కొనసాగుతున్న చిన కామేశ్వరరావును ఇన్‌చార్జిగా కొనసాగాలని విద్యుత్ సౌధా నుంచి జెన్‌కో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. ఈ మేరకు చిన కామేశ్వరరావు శనివారం బాధ్యతలను చేపట్టారు.

పొగాకు వినియోగానికి దూరంగా ఉండాలి: కలెక్టర్



పొగాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, తదితరులు

పాడేరు, మే 31 (ఆంధ్రజ్యోతి): పొగాకు వినియోగానికి ప్రజలు దూరంగా ఉండాలని ఏఎస్ దినేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. జాతీయ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా శనివారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ అంబేడ్కర్ సెంటర్‌లో అందరితో పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞను చేయించి మాట్లాడారు. పొగా వాడకం వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు.ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ డి.హేమలత, డీఈవో బ్రహ్మాజిరావు, డీపీఆర్‌వో పి.గోవిందరాజులు, డీఎస్పీ సహబాజ్‌అహ్మద్, ప్రభుత్వ ఆస్పత్రి కౌన్సిలర్ ఎస్.శాంతి, వివిధ శాఖల అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమాలకు తావులేకుండా రేషన్ పంపిణీ

» జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్



మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

అనంతగిరి, మే 31 (ఆంధ్రజ్యోతి): అక్రమాలకు తావులేకుండా ఆదివారంనుంచి రేషన్ సరకులను డీఆర్ డిపోల్లో పంపిణీ చేయనున్నట్టు రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆయన స్థానిక టీడీపీ నాయకులతో కలిసి శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రజలకు అనునిత్యం అం దుబాటులో ఉండేవిధంగా పభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. లబ్ధిదారులు డిపోల వద్దకు వెళ్లి, వారికి కావాల్సిన నిత్యావసర సరకులు కొనుగోలు చేసుకునేలా మంచి అవకాశం కల్పించినట్టు చెప్పారు. డిపోల వద్ద సెల్స్‌మెన్లు అందుబాటులో ఉంటారని, నాణ్యమైన సరకులను అందిస్తారని వివరించారు. అలాగే, అటవీ ఉత్పత్తులకు జీసీసీకే విక్రయించి గిరిజనులు ఆర్థికంగా ఎదగాలని ఆకాక్షించారు. దళారులను నమ్మిమోసపోవద్దన్నారు. తూకాల్లో మోసం లేకుండా గిరిజనుల ముందే జీసీసీ కాటా వేసి, గిట్టుబాటు ధరతో ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని కోరారు. ఈ కార్యక్రమంలోని టీడీపీ టీడీపీ మండల అధ్యక్షుడు సోవేరి సుబ్బారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొండమ్మ, వైస్ సర్పంచ్ నరేంద్ర, బి. లక్ష్మణరావు, డి.శ్యామ్, పి.జగన్‌బాబు, సన్నిబాబు, తిరుపతిరావు, మహేశ్, అప్పలస్వామి, దేముడు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరులో 98 శాతం పింఛన్లు పంపిణీ



పింఛన్లను పంపిణీ చేస్తున్న కొయ్యూరు ఎంపీడీవో ప్రసాద్

కొయ్యూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో 98 శాతం మేర పింఛన్లు పంపిణీ పూర్తయినట్టు ఎంపీడీవో జీడీవో ప్రసాద్ తెలిపారు. పంచాయతీల వారీగా సచివాలయ సిబ్బంది చే శనివారం ఉదయం నుంచి పింఛన్లు పంపిణీ జరిగేలా చర్యలు చేపట్టామన్నారు. ఏవిధమైన అవకతవకలు జరగకుండా స్వయంగా పరిశీలించినట్టు ఎంపీడీవో వివరించారు.

సీలేరులో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో..

సీలేరు: జీకేవీధి మండలం సీలేరులో శనివారం పింఛన్ పంపిణీని స్థానిక సచివాలయం సిబ్బంది, టీడీపీ నాయకులు చేశారు. పాడేరు నియోజకవర్గం టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిటికెల రాము ఆధ్వర్యంలో పింఛన్ల చురుగ్గా పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బొర్రా కృష్ణ, వి. గోవింగ్, కె. కాశీ, మారిబాబు, ఫిల్లోన్, కిల్లో కార్తీక్, సచివాల యం ఎబ్బంది రింకూ, రేవతి, కుమారి, విజయ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎఫ్‌బీవో వెంకట రమణ సేవలు అభినందనీయం



పదవీ విరమణ పొందిన ఎఫ్‌బీవో వెంకట రమణ దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగులు

చింతపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక రేంజ్‌లో ఫారెస్టు బీట్ ఆఫీసర్‌గా సుదీర్ఘకాలంగా సేవలందించిన సనపల వెంకట రమణ సేవలు అభినందనీయమని లోతుగెడ్డ రేంజ్ అధికారి ఎల్‌బీ పాత్రుడు అన్నారు. శనివారం పదవీ విరమణ పొందిన ఎఫ్‌బీవో వెంకట రమణకు ఉద్యోగులు సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఎఫ్‌బీవో దంపతులను ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా లోతుగెడ్డ రేంజ్ అధికారి వెంకటరమణ సేవలను కొనియాడారు. ఏపీ అటవీశాఖ జూనియర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతే సింహాచలం, కార్యదర్శి లక్ష్మణరావు, ఏవో సత్యనారాయణ, ఎఫ్‌బీవో మండి భూషణం పాల్గొన్నారు.

బదిలీ జెన్‌కో ఏడీఈకి సన్మానం

సీలేరు: సీలేరు ఏపీ జెన్‌కో క్యాంప్ ఏడీగా పని చేసి విద్యుత్‌సౌధా విజయవాడకు బదిలీపై వెళ్తున్న దుర్గా శ్రీనివాస్‌కు శనివారం స్థానిక జెన్‌కో అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి సూపరింటెండెంట్ ఇంజనీర్ బి చంద్రశేఖర్ రెడ్డి హాజరయ్యారు. ఈఈ లు శ్రీనివాసరెడ్డి , రాజేంద్రప్రసాద్, జి. భాస్కరరావు డీఈఈ లు అప్పలనాయుడు, జైపాల్, ఏఈ లు సురేశ్, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో పారిశుధ్య లోపం

» జాతీయ రహదారికి ఆనుకుని పూర్తికాని డ్రైనేజీలు » నిలిచిపోతున్న మురుగు



బురదమయంగా పైవీధి రోడ్డు

డుంబ్రిగుడ, మే 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన డుంబ్రిగుడలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న నివాస గృహలకు డ్రైనేజీ సౌకర్యంలేక మురుగు నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉండడడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, మామిడిచుట్టు సమీపంలోని పైవీధిలో సీసీ రోడ్డు నిర్మించపోవడంతో ఆ ప్రాంతమంతా బురదమయంగా మారింది. ఇటీవల వర్షాలకు మరీ అధ్వాన స్థితికి చేరింది. ఇక్కడ సీసీ రోడ్డు నిర్మించాలని పలుమార్లు మండల అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఈ విషయమై ఉన్నత అధికారులు స్పందించి తక్షణమే పైవీధి రోడ్డుకు సీసీ రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



జాతీయ రహదారి పక్కన డ్రైనేజీ లేక నిల్వ ఉన్న నీరు

ఆశ కార్యకర్తల పోస్టులు భర్తీ చేయాలని వినతి



డీఎంహెచ్‌వోకు వినతిపత్రమిస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశా కార్యకర్తలు

పాడేరురూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్తల పోస్టులు భర్తీ చేయాలని, సీహెచ్‌డబ్ల్యూలను ఆశాలుగా మార్చాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆశా కార్యకర్తలు శనివారం డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషాకు మినుములూరు పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వోను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా సుందరరావుమాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వైద్య సేవలందించేందుకు ఆశాలు, సీహెచ్ డబ్ల్యూలు అవసరం ఉందన్నారు. ఈ స్థితిలో అధికారులు స్పందించి జిల్లాలో ఉన్న 36 పీహెచ్‌సీల పరిధి లో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్తల పోస్టులు భర్తీ చేయాలని, ఏళ్ల తరబడి ఆశాలతో సమానంగా పనిచేస్తున్న సీహెచ్‌డబ్ల్యూలను ఆశాలు గా గు ర్తించాలన్నారు. బకాయి వేతనాలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమం లో పీహెచ్‌సీ వైద్యులు సాయిశ్రీ, మనోజ్ఞ, ఆరోగ్య విస్తరణాధికారి సింహాద్రి, యూనియన్ నాయకులు ఎస్.రామూర్తి, దేశిది భీమలమ్మ పాల్గొన్నారు.

దిగజారిన జీడి పిక్కల ధర.. రైతుల దిగాలు



జీడిపిక్కలు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

ముంచంగిపుట్టు, మే 31 (ఆంధ్రజ్యోతి) : జీడి పిక్కల ధర దిగజారడంతో గిరిరైతులు దిగాలు చెందుతున్నారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో వ్యాపారులు రకాన్ని బట్టీ కిలో జీడి పిక్కలు రూ. 70 నుంచి రూ.80 చొప్పున కొనుగోలు చేశారు. గత నెల కిలో జీడి పిక్కలు రూ.150 పలికాయి. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా జీడి పిక్కలపై నల్లటి మచ్చలు పడి, తడిసి పిక్కల రంగు మారిపోవడంతో ధర పతనమైనట్టు తెలుస్తోంది. ఇదే అదునుగా ప్రైవేటు వ్యాపారులు జీడి పిక్కలకు మరింత రేటు తగ్గించి కొనుగోలు చేపడుతున్నారు. గత్యంతరం లేక వారికే విక్రయించాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తీ వ్రంగా నష్టపోవాల్సి వస్తోందన్నారు. జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా కొనుగోలు చేసే విధంగా చూడాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

ఏకలవ్య కళాశాలల్లో మిగుల సీట్ల భర్తీ రేపు

పాడేరురూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): పాడేరు ఐటీడీఏ పరిధిలోని జీకేవీధి, చింతపల్లి, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ మండలాల్లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కళాశాలలో మిగిలి ఉన్న ఇంటర్ సీట్ల భర్తీకి ఈ నెల 2వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి పాడేరులోని ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ఐటీడీఏ పీవో డాక్టర్ ఎంజే.అభిషేక్ గౌడ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో వివిధ గ్రూపుల్లో సీట్ల కోసం దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు సోమవారం ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు కన్వీనర్ ప్రిన్సిపాల్ ఎం.వి.రమణారావు ఫోన్: 99085 95435కు సంప్రదించాలని కోరారు.

ప్లాస్టిక్ నిషేధానికి అందరూ సహకరించాలి: ఎంపీడీవో



ముంచంగిపుట్టు సంతలో తనిఖీలు చేపడుతున్న ఎంపీడీవో సూర్యనారాయణ మూర్తి

ముంచంగిపుట్టు, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధానికి అందరూ సహకారం అందించాలని ఎంపీడీవో సూర్యనారాయణ మూర్తి అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన వారపు సంతలో దుకాణాలను ఎంపీడీవో తనిఖీలునిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వాటి వలన కలిగే అనర్థాలపై వ్యాపారులకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో పర్యావరణం దెబ్బతినడంతో పాటు మానవాళి మనుగడకు ప్రమాదం ఉందని అన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను విక్రయాలు చేపడితే శిక్షార్హులు అవుతారని వ్యాపారులకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సింహాచలం, కిరణ్‌లు పాల్గొన్నారు.



చోడవరంలోని ద్వారకానగర్‌లో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

అర్హులందరికీ పింఛన్లు: ఎమ్మెల్యే రాజు

చోడవరం, మే 31 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అర్హులందరికీ ప్రభుత్వం పింఛన్లు అందిస్తున్నదని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు చెప్పారు. మండలంలోని లక్ష్మీపురం, ద్వారకానగర్ గ్రామాల్లో శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి అందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, ఈవోపీఆర్‌డీ మహేశ్, మాజీ ఎంపీపీ పెదబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు, వార్డు సభ్యులు తానవరపు శ్రీను, బాలిబోయిన దేముడు, నాయకులు సకురు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రావికమతంలో...

రావికమతం: రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఒక్క రోజు ముందే పింఛన్ సొమ్ము అందిస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు పేర్కొన్నారు. కొత్తకోటలో జరిగిన ఇంటింటికీ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగన్ అవగాహన లేని పాలనతో రాష్ట్రాన్ని కోలుకోలేని అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. చంద్రబాబు అధికారం చేపట్టాక తన అనుభవంతో రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అన్ని రంగాలను పరుగులు తీయిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్నబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు కొండనాయుడు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి, నాయకులు కోట గోవిందరావు, ఉగ్గిన శ్రీను, కోట సత్యనారాయణ, వెల్లంకి ఈశ్వరరావు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది గ్రామంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు శనివారం పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అత్యధిక పింఛన్ అందిస్తున్నది ఆంధ్రప్రదేశ్‌లోనే అన్నారు. వడ్డాది అభివృద్ధికి కట్టుబడి ఉంటామని, యాదవవీధిలో శ్రీకృష్ణుని ఆలయానికి టీటీడీ ద్వారా రూ.10 లక్షలు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వడ్డాది ఈవో లవరాజు, నాయకులు దొండా సన్యాసిరావు, గిరిబాబు, నానాజీ, సింగంపల్లి రమేశ్, సయ్యపు రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు

రోలుగుంటలో...

రోలుగుంట: మండల కేంద్రంలో శనివారం ఎమ్మెల్యే రాజు ఫించన్లు పంపిణీ చేశారు. పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వరరావు, తహసీల్దార్ నాగమ్మ, ఎంపీటీసీ సభ్యుడు సుర్ల రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాడ చంద్ర పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువుతో అధిక దిగుబడులు

» జిల్లా వ్యవసాయ శాఖాధికారి బి.మోహన్‌రావు



చిననందిపల్లిలో నవధాన్యాల పంటలను పరిశీలిస్తున్న మోహన్‌రావు

దేవరాపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట ఎరువులను వినియోగిస్తే భూమి సారవంతమవుతుందని, తద్వారా అధిక దిగుబడులు వస్తాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారి బి,మోహన్‌రావు చెప్పారు. మండలంలోని చిననందిపల్లి, మారేపల్లి గ్రామాల్లో వేసిన నవ ధాన్యాలు పంటలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పచ్చిరొట్ట ఎరువులు వాడడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. నవ ధాన్యాలు పంటలు వేసిన రైతులు తప్పనిసరిగా వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని స్పష్టం చేశారు. తొలకరి రాకముందు వేసే పంటలను నవ ధాన్యాలు అంటారని, ఈ పంట వేయడం వల్ల భూమి గుల్లబారి వాన పాములు వృద్ధి చెందడానికి మంచి అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. అలాగే నేల కోతకు గురికాకుండా నీటి నిల్వలు పెరుగుతాయన్నారు. దీనివల్ల ప్రధాన పంటల్లో కలుపును అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో అధికారుల పర్యటన

» 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



సీతంపేటలో నీటిని మళ్లించేందుకు పారిశుధ్య కార్మికులతో కాలువ తవ్విస్తున్న తహసీల్దార్ లక్ష్మీదేవి, ఎంపీడీవో సువర్ణరాజు

దేవరాపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో శనివారం అధికారులు పర్యటించారు. 'భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం' అన్న శీర్షికతో శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. ఈ మేరకు తహసీల్దార్ లక్ష్మీదేవి, ఎంపీడీవో సువర్ణరాజు నాగయ్యపేట, కొండకొడాబు గ్రామాల్లో పర్యటించి, నీరు చేరిన ఇళ్లను సందర్శించారు. సీతంపేటలో నీరు నిల్వ ఉండడాన్ని గమనించి పంచాయతీ పారిశుధ్య కార్మికులతో తొలగించారు. ఇక్కడ కాలువ ఏర్పాటు చేయించి వరద నీటిని మళ్లించారు. కార్యక్రమంలో కార్యదర్శి జీవన్‌బాబు పాల్గొన్నారు.

రాయితీపై పశువుల దాణా పంపిణీ



పశువుల దాణా పంపిణీ చేస్తున్న ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి

దేవరాపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.కొత్తపల్లిలో ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పశువుల దాణాను ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి శనివారం పంపిణీ చేశారు. 50 కిలోల దాణా బస్తా రూ.1110 కాగా, రైతు రూ.555 చెల్లిస్తే సరిపోతుందని ఈ సందర్భంగా ఎంపీపీ చెప్పారు. మండలానికి ఫేజ్-1లో 220 బస్తాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతల వెంకటరమణ, పశు వైద్యాధికారి కె.మంజుషా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

» నాలుగేళ్ల తర్వాత తెరుచుకుంటున్న రేషన్ దుకాణాలు
» నేటి నుంచి సరకుల పంపిణీ
» నర్సీపట్నం మునిసిపాలిటీ, రూరల్‌లో 45 షాపులు సిద్ధం
» మామిడి తోరణాలు, పూల దండలతో దుకాణాల అలంకరణ
» ఇక నచ్చిన రోజు రేషన్ తెచ్చుకోవచ్చని లబ్ధిదారుల హర్షం



బలిఘట్టంలోని మామిడి తోరణాలు, పూల దండలతో ముస్తాబు చేసిన దుకాణం

నర్సీపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరకులు పంపిణీకి చౌక ధరల దుకాణాలు సిద్ధమయ్యాయి. దాదాపు నాలుగేళ్ల తర్వాత ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయి. దీంతో షాపులు సుందరంగా ముస్తాబయ్యాయి. పూల దండలు, మామిడి తోరణాలతో దుకాణాలను డీలర్లు అలంకరించారు. గతంలో ఉపయోగించిన ఈ-పోస్ యంత్రాలు, ఎలక్ట్రానిక్ కాటాలు తనిఖీ చేసి మళ్లీ వినియోగానికి తీసుకువచ్చారు.

చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ సరకులు పంపిణీ ప్రక్రియను నాలుగేళ్ల తర్వాత ప్రారంభిస్తున్నారు. గత ప్రభుత్వంలో 2021 ఫిబ్రవరి నుంచి చౌక ధరల దుకాణాల ద్వారా సుకులు పంపిణీ నిలిపి వేసింది. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ సరకులు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎండీయూ వాహనాల ద్వారా సరకుల పంపిణీ ప్రక్రియను ఆపేసింది. యథాతథంగా రేషన్ డిపోల డీలర్ల ద్వారా పంపిణీ చేపడుతోంది.

ఇందులో భాగంగా ఆదివారం నుంచి నర్సీపట్నం మునిసిపాలిటీ, మండలంలో దాదాపు 45 రేషన్ డిపోల్లో జాతీయ ఉత్పత్తి పంపిణీ ద్వారా బియ్యం, పంచదార సరఫరా చేస్తారు. లబ్ధిదారులు నేరుగా రేషన్ షాపులకు వెళ్లి తమకు కావాల్సిన సరకులను తెచ్చుకోవాల్సి ఉంది.

అయితే వృద్ధులు, దివ్యాంగులకు మాత్రం ఇంటికి తీసుకు వెళ్లి సరకులు పంపిణీ చేయాలని రేషన్ డీలర్లకు ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఏదేమైనా ఎండీయూ వాహనాలు ఊరులోకి వచ్చే సమయంలో పనులు మానుకుని రేషన్ కోసం ఉండేవారని, ఇప్పుడు రేషన్ దుకాణాల్లో తాము ఖాళీగా ఉన్న సమయాల్లో వెళ్లి సరకులను తెచ్చుకోవచ్చని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తాచేరు డైవర్షన్ రోడ్డుపై ప్రత్యేక దృష్టిసారించండి

» జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు



తాచేరు డైవర్షన్ రోడ్డును పరిశీలిస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు

బుచ్చెయ్యపేట, మే 31 (ఆంధ్ర జ్యోతి): భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్) రహదారిలోని తాచేరు డైవర్షన్ రోడ్డుపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్.రాజు సూచించారు. విజయరామరాజుపేట వంతెన వద్ద డైవర్షన్ రోడ్డును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా బీఎన్ రోడ్డు అధ్వాన స్థితికి చేరిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే ఈ రోడ్డు పూర్తి చేస్తామని హామీ ఇచ్చామని, దీనిపై ప్రభుత్వ పెద్దలు, అధికారులు దృష్టిసారించాలని కోరారు. అలాగే తాచేరు డైవర్షన్ రోడ్డు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వంతెన నిర్మించే వరకు డైవర్షన్ రోడ్డు అవసరమని, ఆ దిశగా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఈర్లె శ్రీరామమూర్తి, కర్రి తమ్మునాయుడు, అల్లం రామఅప్పారావు, దాడి సూర్య నాగేశ్వరరావు, టి.రమేశ్, ఎం.బాబూరావు, డి.సన్యాసిరావు, నవీన్, సూరిఅప్పారావు తదితరులు పాల్గొన్నారు

యోగా దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తిచేయండి

» జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి



పార్కులో ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న డీపీవో శిరీషారాణి

కృష్ణాదేవిపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): అల్లూరి పార్కులో నిర్వహించనున్న యోగా దినోత్సవాన్ని అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి ఆదేశించారు. గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి పార్కులో శనివారం అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సోమవారం జరగనున్న యోగా డేలో పాల్గొనే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల నుంచి సుమారు వెయ్యి మంది పాల్గొనే అవకాశం ఉందన్నారు. కార్యక్రమానికి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ హాజరవుతారని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు డీపీవో సూచించారు.

ఏఎల్‌పురం సంపద కేంద్రం తనిఖీ

అనంతరం జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి ఏఎల్‌పురం సంపద కేంద్రాన్ని సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఎరువుల విక్రయాలు, తయారీ సామగ్రిని పరిశీలించారు. గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తను ఎప్పటికప్పుడు ఎరువుల తయారీకి ఉపయోగించాలని సిబ్బందిని ఆదేశించారు. రహదారుల పక్కన చెత్త కుప్పలు లేకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డీఎల్‌పీవో మూర్తి, గొలుగొండ, నాతవరం ఎంపీడీవోలు మేరీరోజ్, ఉషశ్రీ, ఈవోపీఆర్‌డీ కె.శ్రీనివాస్, గొలుగొండ జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్, టీడీపీ నేత బొడ్డు జమీలు, యోగా గురువు దీపక్‌బలగ పాల్గొన్నారు.

గుట్కా విక్రయాలపై పోలీసుల ఆకస్మిక తనిఖీలు



వేములపూడిలో తనిఖీలు చేస్తున్న రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ రాజారావు

నర్సీపట్నం రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖైనీ, గుట్కాలు విక్రయిస్తున్న దుకాణాలపై రూరల్ పోలీసులు శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ రాజారావు వేములపూడి గ్రామంలోని పాఠశాలలకు దగ్గరలో ఉన్న పాన్‌షాపులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ రేవతమ్మ మాట్లాడుతూ విద్యా సంస్థలకు వంద మీటర్ల పరిధి లోపు ఖైనీ, గుట్కాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాన్ని దుకాణదారులు గమనించాలని ఆమె సూచించారు.

గొలుగొండలో...

గొలుగొండ: అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా ఎస్ఐ రామారావు శనివారం పాన్‌షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాన్ షాపుల్లో ఖైనీలు, గుట్కాలతో పాటు ఇతర నిషేధిత మత్తు పదార్థాలు క్రయవిక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాటి నిర్మూలనకు ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండే విధంగా తల్లిదండ్రులు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు

మాడుగుల రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కోడూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవతలు పసర్ల మోదకొండమ్మ, భూలోకమ్మ అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయానికి రంగులు వేయడంతో పాటు వివిధ అభివృద్ధి పనులు చేస్తున్నారు. వచ్చే నెల 8వ తేదీన విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ నిర్మాణ కర్త కలిమి శివ తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తామన్నారు. అలాగే అన్నసమారాధన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వైసీపీ నేతపై రౌడీ షీటర్ దాడి



దాడిలో గాయపడ్డ ఈశ్వరరావు

నర్సీపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బలిఘట్టం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడుపై పట్టణానికి చెందిన రౌడీ షీటర్, మరి కొందరు శనివారం దాడి చేశారు. ఈ సంఘటనకు సంబంధించి పట్టణ సీఐ గోవిందరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. మునిసిపాలిటీ పరిధిలోని బలిఘట్టం ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకుడు అల్లంపల్లి ఈశ్వర్రావు శనివారం ఉడిపి హోటల్‌లో టిఫిన్ చేయడానికి నర్సీపట్నం వచ్చాడు. అదే సమయంలో పాల్‌ఘాట్ సెంటర్‌లో వేరే గొడవ జరుగుతుండగా ఈశ్వరరావు నిలబడి చూస్తున్నాడు. ఇంతలో రౌడీ షీటర్ పప్పలనాయుడు, మరి కొందరు వచ్చి తనపై దాడి చేశారని బాధితుడు ఈశ్వరరావు ఫిర్యాదు చేసినట్టు సీఐ తెలిపారు. అతను ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. దాడి చేసి పారిపోయిన పప్పల నాయుడు కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు.

ప్రధాన రహదారి పక్కనే చెత్తాచెదారం..



రోలుగుంట ప్రధాన రహదారి పక్కనే పేరుకుపోయిన చెత్తాచెదారం

రోలుగుంట, మే 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చెత్తాచెదారం పేరుకుపోయింది. రోలుగుంట ప్రధాన రహదారి పక్కనే చెత్త కుప్పలుగా ఉంది. సంపద కేంద్రాలు ఉన్నా రోడ్డు పక్కనే చెత్తను వేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొమరవోలు గ్రామం వెళ్లే రహదారికి పక్కనే ఉన్న రోడ్డుపైనే చెత్తాచెదారం వేస్తున్నారు. పక్కనే చెరువు ఉండడంతో చెత్తాచెదారం చెరువులో కలిసి నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి అధికారులు నిత్యం అటువైపు వెళుతున్నా కనీసం పట్టించుకునే దాఖలాలు లేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు పక్కన చెత్త వేయకుండా తక్షణమే నివారణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యార్థుల్లో చైతన్యానికి యోగా శిక్షణ దోహదం

దేవరాపల్లి/బుచ్చెయ్యపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఇస్తున్న యోగా శిక్షణ విద్యార్థుల్లో చైతన్యానికి ఎంతగానో దోహదపడుతుందని యోగా గురువులు అన్నారు. దేవరాపల్లి ఉన్నత పాఠశాల, బుచ్చెయ్యపేట మండల కేంద్రంలో యోగా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శిక్షకులు మాట్లాడుతూ నెల రోజులు పాటు ఇస్తున్న శిక్షణలో కఠినమైన ఆసనాలను అవలీలగా వేయడం నేర్చుకున్నారన్నారు. ఈ కార్యక్రమాల్లో రెండు మండలాల తహసీల్దార్లు లక్ష్మీదేవి, ఎం.లక్ష్మి, ఎంపీడీవోలు సువర్ణరాజు, విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, వెలుగు ఏపీవో వరహాల బాబు, యోగా గురువులు గెడ్డం నాగేశ్, బోలే పైడిరాజు, మాస్టర్ ట్రైనీ ఎన్.హేమసాయి తదితరులు పాల్గొన్నారు.

పొగాకుతో క్యాన్సర్ ముప్పు

రావికమతం, మే 31 (ఆంధ్రజ్యోతి): పొగాకు తాగితే క్యాన్సర్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని కొత్తకోట వైద్యాధికారి సురేఖ హెచ్చరించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం కొత్తకోటలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె మాట్లాడారు. పొగాకు కాల్చడం వల్లఎంతో మంది క్యాన్సర్ బారిన పడి ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పొగ తాగిన వారి కంటే దాన్ని పీల్చిన వారికే ఎక్కువ ప్రమాదం ఉందన్నారు. బహిరంగంగా ధూమపానం తాగడం నిషేధమని, ఈ నిబంధన ఉల్లంఘించిన వారికి ప్రభుత్వం జరిమానా విధిస్తున్నదని చెప్పారు. ప్లాస్టిక్ సంచుల వాడకం వల్ల కూడా క్యాన్సర్ ముప్పు ఉందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు, హెచ్ఎస్ రమణ, హెచ్‌వీ ఎర్రమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు

నాతవరం, మే 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరంలో 250 మందికి సేవలు అందించారు. కేఎస్ఆర్ బృందం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వైద్యులు పావని, దేదీప్య రోగులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు కొండబాబు, విజయ్‌కుమార్, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, స్థానిక నాయకులు అపిరెడ్డి మాణిక్యం, ఇటంశెట్టి సీతారామ్మూర్తి, పైల సూరిబాబు, చింతకాయల శ్రీనివాస్, శెట్టి నానాజీ పాల్గొన్నారు.

వైసీపీ యువజన కమిటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా వరుణ్



వరుణ్‌ను అభినందిస్తున్న మాజీ సీఎం జగన్

నర్సీపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ యువజన కమిటీ సంయుక్త కార్యదర్శిగా చింతకాయల వరుణ్ (దొర)ను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కమిటీ శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు మాజీ సీఎం జగన్, మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేశ్, వైసీపీ నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠ

రావికమతం, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట గ్రామంలో గోవిందమ్మ, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వబ్రాహ్మణుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ధ్వజ స్తంభం ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం శుభ మూహూర్తానికి ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోన లోవరాజు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ జి.సత్యదేవ, స్థానిక నేత శీలం శంకరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో గేదె మృతి



చోడవరం, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింహాద్రిపురం శివారు సాతిక గ్రామంలో శుక్రవారం రాత్రి పిడుగు పడడంతో రైతు గొర్లె దేవుడుకు చెందిన గేదె మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.60 వేలు విలువ ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

మెప్మా బజారులో రూ.39,800 విక్రయాలు

నర్సీపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మినీ స్టేడియంలో స్టాల్స్ ఏర్పాటు చేసి ఎస్‌హెచ్‌జీ సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించారు. చిరుధాన్యాలు, క్లాత్ బ్యాగులు, చీపుర్లు, తల నూనెల, ఫినాయిల్, తిను బండారాలను శనివారం స్థానికులు కొనుగోలు చేశారు. మొత్తం రూ.39,800 విక్రయాలు చేసినట్టు మెప్మా సీవో రమాదేవి తెలిపారు.

పిచ్చి కుక్క దాడిలో ఏడుగురికి తీవ్ర గాయాలు



గాయపడ్డ రమణ

చీడికాడ, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరహాపురం గ్రామంలో రెండు రోజులుగా పిచ్చి కుక్క స్వైరవిహారం చేస్తున్నది. శనివారం కుక్క దాడి చేయడంతో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామానికి చెందిన మిస్కా రమణ, బాలిబోయిన చిలకమ్మ, దొడ్డి అచ్చన్న, మజ్జి అచ్చియ్యమ్మ, బిరుదుకోట అర్జునమ్మ, రామశెట్టి దేముళ్లమ్మ, మల్లివలస చినదేముడు పిచ్చి కుక్క కాటు వేయడంతో గాయపడ్డారు. వీరిని వెంటనే చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. అయితే గ్రామంలో కుక్కలు ఎక్కువుగా ఉన్నాయని, వాటిని తరిమివేయాలని గ్రామ పంచాయతీ అధికారులను స్థానిక ప్రజలు కోరారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

చీడికాడ, మే 31 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని గ్రంథాలయ అధికారి ఎంఎస్ఎల్.జోగేశ్వరి అన్నారు. వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో శనివారం హైస్కూల్ విద్యార్థులతో వాలీబాల్ పోటీలను నిర్వహించారు. అనంతరం జనరల్ నాలెడ్జిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వేసవి సెలవులు ముగిసేవరకూ ఈ కార్యక్రమం ఉంటుందని ఆమె తెలిపారు.

ఘనంగా సిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం

మాడుగుల రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సిద్ధి వినాయక ఆలయంలో శనివారం 12 వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పూజారి సుబ్బారావు పంచామృతాభిషేకం చేశారు. వివిధ రకాల పదార్థాలను ప్రసాదంగా తయారు చేయించి స్వామికి నైవేద్యంగా పెట్టి భక్తులకు పంచారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

డ్రైవింగ్‌తో ఉపాధికి ఊతం

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు సాధించడం, లేకపోతే తమ కాళ్లపై తాము నిలబడి స్వయం ఉపాధి పొందడమే లక్ష్యంగా యువత డ్రైవింగ్‌లో శిక్షణ పొందుతోంది. నగరంలోని కంచరపాలెంలోని ప్రభుత్వ పాత ఐటీఐ వీరికి ఊతమిస్తోంది. స్వల్పకాలిక కోర్సు (45 రోజులు)గా డ్రైవింగ్‌లో శిక్షణ పూర్తిచేశాక ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉపాధిని సొంతం చేసుకుంటున్నారు. యువకులతో పాటు యువతులు కూడా డ్రైవింగ్ శిక్షణకు ముందుకు రావడం గమనార్హం.

- స్వల్పకాలిక శిక్షణతో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగావకాశాలు
- పోటీపడుతున్న యువతీ యువకులు


బస్సు నడుపుతున్న యువకుడు (ఫైల్)

అభ్యర్థులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు శిక్షణ ఇస్తున్నారు. వాహనం నడపడంలో ప్రాథమిక అంశాలు, నిర్వహణ, టైర్ల మార్పిడి, ఇంజన్ పనితీరు గురించి తెలియజేయడం, ట్రాఫిక్ సిగ్నల్స్ వివిధ మార్గాల్లో వాహనాలు నడిపే తీరు, ఎత్తుపల్లాల దగ్గర వాహనం నడిపే విధానం, ట్రాఫిక్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ... తదితర అంశాలను క్షుణ్ణంగా వివరిస్తూ లైట్ (కారు), హెవీ (బస్సు) డ్రైవింగ్‌లో నిపుణులు శిక్షణ ఇస్తుండడం ఇక్కడి ప్రత్యేకతగా చెప్పవచ్చు.

ఇందులో చేరాలంటే...

కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐలో డ్రైవింగ్ కోర్సులో శిక్షణ పొందాలనుకునే అభ్యర్థులు పదోతరగతి ఉత్తీర్ణతతో పాటు ఆర్టీవో బ్యాడ్జ్ కలిగి ఉండాలి. అభ్యర్థుల వయస్సు 21 ఏళ్లు నిండి ఉండాలి.

హెవీ, ఎల్ఎల్ఆర్ లైసెన్సు ఉండాలి. నాలుగు చక్రాల వాహనం నడపాలంటే ఎల్ఎల్ఆర్‌తో పాటు పదోతరగతి ఉత్తీర్ణత పొంది 18 ఏళ్లు నిండి ఉండాలి. అలాగే శిక్షణ రుసుముగా రూ.3 వేలు చెల్లించాలి.

శిక్షణానంతరం ధ్రువపత్రాలు ...

ప్రభుత్వ ఐటీఐలో డ్రైవింగ్ శిక్షణ పొందే అభ్యర్థులకు మెలకువలు నేర్పడంతో పాటు అవుట్ డోర్‌లోనూ శిక్షణ ఇస్తారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు. ప్రభుత్వ ఐటీఐలో జారీ చేసిన సర్టిఫికెట్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంటున్నందున ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు అభ్యర్థులకు ఉపాధి కల్పిస్తున్నాయి. వివిధ ప్రభుత్వ సంస్థల్లో డ్రైవర్ ఉద్యోగాలకు ఇచ్చే నోటిఫికేషన్‌లో ప్రభుత్వ ఐటీఐల్లో శిక్షణ పొందేవారికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుండడంతో ఇక్కడ డ్రైవింగ్ పొందేందుకు అత్యధికులు ఆసక్తి కనబరుస్తున్నారు.

అందుబాటులో ఉన్న వాహనాలు...

ఇక్కడ యువతకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు పలు రకాల వాహనాలు అందుబాటులో ఉన్నాయి. శిక్షణ అందించే బస్సు పాతది కావడంతో మాజీ ఎంపీ కంభంపాటి హరిబాబు తన ఎంపీ కోటా నిధులతో గతంలో కొత్త బస్సును సమకూర్చారు. ప్రస్తుతం ఈ బస్సులోనే శిక్షణ ఇస్తున్నారు.

ఉద్యోగావకాశాలు పుష్కలం

ఇక్కడ శిక్షణ పొందిన అభ్యర్థులకు వివిధ సంస్థల్లో ఉద్యోగాలు పొందేందుకు అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. పోలీస్, అగ్నిమాపక సంస్థ, ఆర్టీసీ, రైల్వే, మిలటరీ, ఇంజినీరింగ్ సర్వీసెస్ (ఎంఈఎస్), ఇండియన్ కోస్టుగార్డు, సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్ తదితర సంస్థల్లో ఉద్యోగాలు పొందడానికి అర్హులుగా గుర్తింపు పొందుతారు. ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు రానివారు కారు కొనుక్కుని డ్రైవర్‌గా ఉపాధి పొందుతుంటారు. క్యాబ్‌లు, ఉబర్, ఓలా తదితర సంస్థల్లోనూ పనిచేస్తుంటారు. ఆర్థిక స్థోమత లేని వారు పలు ట్రావెల్ ఏజెన్సీలు, ప్రైవేటు వ్యక్తుల వద్ద డ్రైవర్లుగా పనిచేస్తుంటారు. ఐటీఐలో శిక్షణ పొందిన వందలాది మంది ఇప్పటికే వివిధ ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తుండడం గమనార్హం.

శిక్షణ చాలా బాగుంది



ప్రభుత్వ ఐటీఐలో అందిస్తున్న డ్రైవింగ్ శిక్షణ చాలా బాగుంది. వివిధ సందర్భాల్లో వాహనాలు ఎలా నడపాలో మెలకువలు అందిస్తున్నారు. చక్కని నైపుణ్యంతో కూడిన శిక్షణ పొందడం ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుంది. రద్దీగా ఉండే రోడ్లు, కొండప్రాంతాల్లో ప్రయాణించేటప్పుడు వాహనాలు ఎలా నడపాలో ప్రాక్టికల్‌గా నేర్పిస్తున్నారు.

- ప్రశాంత్, శిక్షణపొందుతున్న యువకుడు

ఉపాధి కోసం చేరా...



ఇక్కడ డ్రైవింగ్ శిక్షణ తీసుకుని వాహనాన్ని నడిపి స్వయం ఉపాధి పొందడానికి చేరాను. డ్రైవింగ్‌తో పాటు ట్రాఫిక్ నియమాలు, థియరీ క్లాసులు బాగున్నాయి. శిక్షణ పూర్తిచేసుకుని మంచి డ్రైవర్‌గా స్థిరపడతా..

- జి.మణికంఠ

శిక్షణలో నైపుణ్యం



ప్రభుత్వ ఐటీఐలో చేరిన నిరుద్యోగులకు నాణ్యమైన డ్రైవింగ్ శిక్షణ లభిస్తుంది. ఇక్కడ శిక్షణ పొందిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కొందరికి వస్తుంటాయి. మరికొందరు సొంతంగా వాహనాలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. శిక్షణ పొందిన అనంతరం వారికి ప్రభుత్వం ధ్రువీకరణ పత్రం అందిస్తుంది.

- జె.శ్రీకాంత్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ పాత ఐటీఐ



పరిశ్రమల ఏర్పాటుకు సహకరించాలి

- ఏపీఐఐసీకి భూములిచ్చిన రైతులకు న్యాయం చేస్తాం : హోం మంత్రి అనిత


నిర్వాసిత రైతులతో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత, పక్కన కలెక్టర్ విజయకృష్ణన్

నక్కపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటుకు సహకరించాలని, ఏపీఐఐసీకి భూములిచ్చిన రైతులకు న్యాయం చేస్తామని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి డీఎల్‌పురం, రాజయ్యపేట, చందనాడ, వేంపాడు గ్రామాలకు చెందిన కారిడార్ నిర్వాసిత రైతులతో సమావేశం నిర్వహించారు. పలు సమస్యలపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుర్తించిన నిర్వాసిత రైతులకు ఆర్ఆర్ ప్యాకేజీతో పాటు అన్ని సదుపాయాలతో లేఅవుట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. నిర్వాసిత రైతుల సమస్యలు, ప్యాకేజీ తదితర అంశాలపై టీడీపీ నియోజవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, రైతు సంఘ ప్రతినిధులు గింజాల లక్ష్మణరావు, గింజాల శ్రీనివాసరావు, కాళ్లశ్రీను, గంటా తిరుపతిరావు, తళ్లా భార్గవ్ వివరించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ నక్కపల్లి మండలంలో బల్క్‌డ్రగ్ పార్కుతో పాటు ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కానున్నదని చెప్పారు. నిర్వాసితులకు పెదబోదిగల్లం వద్ద 151 ఎకరాల్లో లేఅవుట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. మొత్తం రూ.693 కోట్ల వ్యయంతో ఆర్ఆర్ ప్యాకేజీ అమలుచేస్తున్నామని, రూ.209 కోట్ల వ్యయంతో లే అవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు వివరించారు. డొంకాడలో దళితులు తమపై దాడి జరిగినా చర్యలు తీసుకోలేదని బాధితులతో కలిసి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు హోం మంత్రి, కలెక్టర్ వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. స్పందించిన మంత్రి నిష్పక్షపాతంగా దర్యాప్తు జరపాలని డీఎస్పీ శ్రీనివాసరావును ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్‌డీసీ అనిత, ఆర్‌డీవో వీవీవీ రమణ, ప్రత్యేకాధికారి ప్రసాద్, తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీడీవో డి. సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ భూముల పరిశీలన

మాకవరపాలెం: రాచపల్లి రెవెన్యూలో ఏపీఐఐసీ భూములను శనివారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పరిశీలించారు. అనంతరం రామన్నపాలెం సెంటరు నుంచి ఎరకన్నపాలెం, అక్కడ నుంచి ఎలమంచిలి పెదపల్లి గ్రామం వరకు 10 కిలోమీటర్లు పొడవునా 40 అడుగుల రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు ఆమె తెలిపారు. అలాగే రాచపల్లి రెవెన్యూలో రామన్నపాలెం వద్ద ఉన్న ఏపీఐఐసీ ఆధీనంలోని 310 ఎకరాల్లో సూక్ష్మ, చిన్న మధ్య తరహా సంస్థలు ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎరకన్నపాలెంలో ఉన్న 737 సర్వే నంబరులో 450 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ప్రస్తుతం ఈ భూమి రైతుల ఆక్రమణలో ఉందని, సర్వే చేసి ఆక్రమణలను తొలగిస్తామన్నారు. ఇప్పటికే ఫారెస్ట్, రెవెన్యూ హద్దులు గుర్తించామన్నారు. రాబోయే రెండేళ్లలో ఇక్కడ కొన్ని కంపెనీలు ఏర్పాటు కానున్నాయన్నారు. తొలుత రోడ్డు పనులు ప్రారంభించాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహారావును ఆదేశించారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఎలమంచిలి బైపాస్ 10 కిలోమీటర్లు తగ్గుతుందన్నారు. సెకెండ్ ఫేజ్ మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే వీఎంఆర్‌డీఏ ఇళ్ల ప్లాట్లకు స్థలాన్ని చూడాలని ఆర్‌డీవో రమణను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డీవో రమణ, తహసీల్దార్ రామారావు, టీడీపీ నాయకులు అల్లు రామునాయుడు, అడిగర్ల శ్రీను, ఏకా రాము పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- కలెక్టర్ విజయకృష్ణన్


మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ, వైద్యశాఖ, గ్రామీణ నీటి పారుదల శాఖ, పంచాయతీరాజ్ అధికారులతో వెబెక్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున మంచి నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేయాలన్నారు. మంచినీటి పైపులు లీకేజీలు లేకుండా చూడాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతి వారం డ్రైడే పాటించాలని సూచించారు. ఆస్పత్రుల్లో అవసరమైన మందులు నిల్వ చేసుకోవాలన్నారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

... 5వ పేజీ తరువాయి

జరిగింది. 2023 జనవరి 22న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించగా, రాష్ట్రం మొత్తమ్మీద సుమారు ఐదు లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 95 వేల మంది అర్హత సాధించారు. వారికి శారీరక, దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించి 38,910 మందిని ఎంపిక చేశారు. వారికి ఆదివారం మెయిన్స్ నిర్వహించబోతున్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన 12,491 మంది ఆదివారం మెయిన్స్ పరీక్షకు హాజరుకానున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

మెయిన్స్ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్నది. అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి ఉదయం 9 గంటల నుంచే అనుమతిస్తారు. పది గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలకు అనుమతించరు. అభ్యర్థులు హాల్ టికెట్‌తోపాటు ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకువెళ్లాలి. హాల్ టికెట్‌తోపాటు బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్ను మాత్రమే తీసుకువెళ్లాల్సి ఉంటుంది. అభ్యర్థుల హాజరును బయోమెట్రిక్ ద్వారా నమోదు చేయనున్నారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, ఇతర గాడ్జెట్లను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించనున్నారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్లు పరిధిలో జెరాక్స్, కంప్యూటర్ కేంద్రాలను మూసియాలని ఇప్పటికే పోలీసు అధికారులు ఆదేశించారు.

అక్కాచెల్లెళ్లకు సికిల్‌సెల్ అనీమియా

- నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆరేళ్ల బాలిక మృతి
- ఆమె సోదరిని కేజీహెచ్‌కు తరలించాలని వైద్యుల సూచన


మృతి చెందిన దవళ యోధశ్రీ (ఫైల్)

కొయ్యూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం చిన్నపాడు పంచాయతీ గోపవరానికి చెందిన ఆరేళ్ల బాలిక శనివారం సాయంత్రం సికిల్‌సెల్ అనీమియాతో మృతి చెందింది. ఆమె సోదరి కూడా ప్రస్తుతం ఆస్పత్రిలో ఉంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దవళ దారబాబు, దేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు భాగ్యశ్రీ (10), యోధశ్రీ (6). ఇద్దరూ సికిల్‌సెల్ అనీమియా వ్యాధితో బాధపడుతున్నారు. భాగ్యశ్రీని రెండు రోజుల క్రితం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. శనివారం ఉదయం యోధశ్రీని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందింది. కాగా భాగ్యశ్రీని మెరుగైన వైద్య సేవల నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించాలని వైద్యులు సూచించారు.

క్రైం... crime news

79 కిలోల గంజాయితో ఒకరి అరెస్టు

- కారు స్వాధీనం


పట్టుబడిన గంజాయితో కొయ్యూరు ఎస్ఐ కిశోర్‌వర్మ, సిబ్బంది

కొయ్యూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 79 కిలోల గంజాయితో ఒకరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కిశోర్‌వర్మ తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా నుంచి బెంగళూరుకు గంజాయి రవాణా జరుగుతున్నట్టు అందిన ముందస్తు సమాచారం మేరకు ములకలపాడు కూడలి వద్ద శుక్రవారం మధ్యాహ్నం నుంచి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. సాయంత్రం ఒక కారును తనిఖీ చేయగా గంజాయిని గుర్తించారు. ఈ సందర్భంగా 79 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని అన్నమయ్య జిల్లా పెద్దపాలెం గ్రామానికి చెందిన చినమేకల శ్రీనివాసులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ కిశోర్‌వర్మ తెలిపారు. గంజాయి రవాణకు వినియోగించిన కారును సీజ్ చేసినట్టు ఆయన చెప్పారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.3.97 లక్షలు ఉంటుందని ఆయన చెప్పారు.

మాటలతో మభ్యపెట్టి మస్కా!

- మహిళల వద్ద నగలు కాజేసిన ఇద్దరు కి'లేడీల' అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న క్రైమ్ ఎస్ఐ సూరిబాబు (ఇన్‌సెట్‌లో) స్వాధీనం చేసుకున్న బంగారం వస్తువులు

పెందుర్తి, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల మాదిరిగా నటిస్తూ మహిళా ప్రయాణికులను మాటలతో మభ్య పెట్టి ఏమరుపాటుగా ఉన్న సమయంలో వారి బ్యాగులు తస్కరించి అందులో గల బంగారు ఆభరణాలు మాయం చేసే ఇద్దరు కిలాడీ మహిళలను పెందుర్తి నేర విభాగం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 50 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం నేర విభాగ ఎస్ఐ సూరిబాబు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. వేపగుంట సింహపురి కాలనీలో నివాసముంటున్న తాలిశెట్టి మంగతాయారు గోపాలపట్నంలోని కో-ఆపరేటివ్ బ్యాంకులో బంగారు గొలుసు కుదువ పెట్టేందుకు వేపగుంట జంక్షన్‌లో ఆటో ఎక్కింది. నాయుడుతోట వద్ద ఇదే ఆటోలో ఓ మహిళ ఎక్కి ఆమెను మాటల్లోకి దించి గోపాలపట్నం బంక్ వద్ద దిగింది. మంగతాయారు బ్యాంకు వద్దకు వెళ్లి బ్యాగు తీసి చూడగా అందులో బంగారు గొలుసు భద్రపరిచిన పర్స్ కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన ఆమె ఆటో లో ప్రయాణించిన సహచర మహిళ చోరీ చేసిందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

విజయనగరం జిల్లా గుర్ల మండలం బీసీ కాలనీలో నివాసముంటున్న గొలజాన మోహిని వ్యక్తిగత పనులపై రాంపురంలోని బంధువుల ఇంటికి వచ్చింది. పనులు పూర్తయ్యాక తిరుగు ప్రయాణంలో బంగారు వస్తువులున్న పర్స్‌ను బ్యాగులో పెట్టుకుని విజయనగరం వెళ్లేందుకు పెందుర్తి జంక్షన్‌లోని బస్టాప్‌లో తన ఊరు బస్సు రాగానే ఎక్కి సీటులో కూర్చుంది. టికెట్ తీద్దామని ఒడిలో ఉన్న బ్యాగు తెరిచి చూడగా జిప్ తెరిచి ఉంది. దీంతో ఆందోళన చెంది లోపల వెతకగా బంగారు వస్తువులు భద్రపరిచిన పర్స్ కనిపించలేదు. బస్సు ఎక్కేటప్పుడు తనను తోసుకుంటూ వచ్చిన మహిళ ఈ చోరీ చేసి ఉంటుందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధిత మహిళలు అందజేసిన వివరాల ప్రకారం క్రైమ్ ఎస్ఐ సూరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించారు. చోరీ జరిగిన స్థలాల్లో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. బాధిత మహిళలు చెప్పిన ఆనవాళ్లతో కేసులో పురోగతి కనిపించడంతో ఈ చోరీలు పాత నేరస్థులైన ఎర్రగొల్లల ముఠా కిలాడీ మహిళల పనిగా నిర్ధారించారు. దీంతో పోలీసులు అనకాపల్లి జిల్లా కోటపాడు మండలం గొట్లం గ్రామానికి చెందిన రావుల వసంత(25), మేకల సంధ్య(27) లను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. నేరం నిర్ధారణ కావడంతో వారి వద్ద నుంచి చోరీ చేసిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని మహిళలను అరెస్ట్ చేశారు.

జూన్ 6 నుంచి డీఎస్సీ రాత పరీక్షలు

- ఉమ్మడి జిల్లాలో ఏడు కేంద్రాలు....32 వేల మంది అభ్యర్థులు

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం జూన్ ఆరో తేదీ నుంచి డీఎస్సీ రాత పరీక్షలు నిర్వహించనున్నారు. పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహించనున్న ఈ పరీక్షలకు ఏడు కేంద్రాలు ఏర్పాటుచేశారు. ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా పరీక్షలు జరుగుతాయి. మొత్తం 32 వేల మంది హాజరుకానున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 1,139 పోస్టులు భర్తీచేయనున్నారు. పరీక్షలకు విద్యా శాఖ అన్ని ఏర్పాట్లుచేసింది.

బదిలీల హడావిడి

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగులు రెండు అంతకంటే ఎక్కువ లేఖలు సమర్పించారు. జిల్లా హౌసింగ్ కార్యాలయంలో పలువురు ఉద్యోగులు, ఇంజనీర్ల బదిలీకి అధికారులు జాబితా సిద్ధం చేశారు. తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యే బంధువునంటూ హల్‌చల్ చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఏఈని కూడా బదిలీ చేయాలని అధికారులు నిర్ణయించారు. ఖజానా కార్యాలయంలో పరిధిలో బదిలీల నిర్వహణకు అధికారులు కమిటీ వేశారు. అయితే సంఘ నేతలమని కొందరు, ఇతరత్రా కారణాలతో మరికొందరు బదిలీల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. పౌరసరఫరాల శాఖలో పలువురు చెకింగ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేయాలని అధికారులు నిర్ణయించారు.

మద్యం దుకాణాలపై నిఘా

... 5వ పేజీ తరువాయి

తీసుకొచ్చారు?, ఎంత విక్రయించారు? అనే సమాచారం అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం పబ్లిక్ ఐపీ ద్వారా రెండు షాపులను కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తున్నారు. ఒక వారం రోజుల్లో 50 శాతం షాపులు కంట్రోల్ రూమ్ పరిధిలోకి వచ్చేస్తాయి. జూన్ నెలాఖరులోగా జిల్లాలోని అన్ని మద్యం షాపులు కంట్రోల్ రూమ్ పర్యవేక్షణలోకి వస్తాయని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ సర్జిత్‌సింగ్ తెలిపారు.

నేటి నుంచి రేషన్ డిపోల్లో సరకుల పంపిణీ

... 5వ పేజీ తరువాయి

వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు చౌక దుకాణాల్లో సరకులు పంపిణీ చేయాలన్నారు. 65 సంవత్సరాలు దాటిన వారి ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌వో సత్యనారాయణరావు, మండలాల నుంచి వెబెక్స్‌లో అధికారులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539